నేటి దినపత్రిక
# సూర్య
17 వ వసంతంలోకి
శ్రీ పొట్టి శ్రీరాములు నెల్లూరు

శుక్రవారం | 23 ఆగస్టు 2024 | పేజీలు 8

## అక్రమంగా ఇసుక రవాణా చేస్తే కఠిన చర్యలు తప్పవు

### జిల్లా ఎస్పీ జి.కృష్ణకాంత్



**నెల్లూరు కలెక్టరేట్, మేజర్‌న్యూస్ :** జిల్లా పోలీస్ సూపరిండెంట్ కృష్ణకాంత్ మాట్లాడుతూ.. జిల్లాలో ఇసుక అక్రమ రవాణా ఉపేక్షించేది లేదని, బ్లాక్ మార్కెటింగ్ అక్రమ దంపులపై కఠిన చర్యలు తీసుకుంటామన్నారు. మర్రిపాడులో ఉన్న ఇసుక రీచ్ వద్ద పటిష్టమైన నిఘా ఏర్పాటు చేశామన్నారు. స్టాక్ పాయింట్ ప్రాంతానికి వేబిల్లులు, టైం స్లాట్‌లో ఉన్న వాహనాలను మాత్రమే అనుమతి ఇస్తామన్నారు. టోల్ ప్లాజా వద్ద టీంలు ఏర్పాటు చేసి నిరంతరం తనిఖీలు చేస్తామన్నారు. ట్రాన్స్‌పోర్టర్లతో ఏర్పాటు చేసిన సమావేశంలో జాయింట్ కలెక్టర్ కార్తీక్, మైన్స్ డిప్యూటీ డైరెక్టర్ శ్రీనివాసరావు, డిప్యూటీ ట్రాన్స్‌ఫోర్ట్ కమిషనర్ చందర్, ఆర్టీవోలు, ఇసుక సరఫరా ట్రాన్స్‌పోర్టర్లు పాల్గొన్నారు.

## దివ్యాంగుడికి ఎంపీ వేమిరెడ్డి ఆర్థిక సహాయం



**నెల్లూరు కలెక్టరేట్, మేజర్‌న్యూస్ :** రైలు ప్రమాదంలో రెండు కాళ్ళు కోల్పోయిన దివ్యాంగుడికి నెల్లూరు పార్లమెంట్ సభ్యులు వేమిరెడ్డి ప్రభాకర్ రెడ్డి రూ.50 వేలు ఆర్థిక సహాయం చేసి ఆదుకున్నారు. ఇందుకూరుపేట మండలం గంగపట్నం పల్లిపాళెం గ్రామానికి చెందిన పొనవాడ రమేష్ బాబు రైలు ప్రమాదంలో తన రెండు కాళ్ళు కోల్పోయారు. పిల్లలను చదివించే ఆర్థిక స్థోమత లేదని మొరపెట్టుకోవడంతో చలించిపోయిన ఎంపీ వేమిరెడ్డి ప్రభాకర్ రెడ్డి తమ విపిఆర్ ఫౌండేషన్ ద్వారా రూ.50 వేలు ఆర్థిక సహాయం అందజేశారు. ఆర్థిక సహాయం అందుకున్న రమేష్ బాబు ఎంపీ వేమిరెడ్డికి కృతజ్ఞతలు తెలిపారు.

## నేడు ఆంధ్రకేసరి టంగుటూరి ప్రకాశం జయంతి



**నెల్లూరు కల్చరల్, మేజర్‌న్యూస్ :** రండిరా.. కాల్చుకోండి రా.. అని బ్రిటిష్ వారిని రొమ్మిదిరించిన ఆంధ్ర కేసరి,ఆంధ్ర రాష్ట్ర తొలి ముఖ్యమంత్రి టంగుటూరి ప్రకాశం పంతులు 152వ జయంతిని శుక్రవారం నిర్వహించనున్నారు. టంగుటూరి జీవిత నిరాష్ట్ర పండుగల రాష్ట్ర ప్రభుత్వం ప్రకటించిన విషయం విదితమే. నెల్లూరు నగరంలోని కూరగాయల మార్కెట్ వద్ద ఆంధ్ర కేసరి టంగుటూరి ప్రకాశం విగ్రహానికి పూలమాల వేసి నివాళులర్పించేందుకు బ్రాహ్మణ సంఘాలు, ప్రభుత్వం సమయాత్తమవుతుంది.



# భద్రత ఏదీ!

### జిల్లాలో ఫ్యాక్టరీలు అనేకం

- నిబంధనలకు పాతర
- ప్రమాదాలు సంభవించినప్పుడు మాత్రమే అధికారులు హడావుడి
- కాలుష్యంతో రోగాల బారిన ప్రజలు
- పట్టించుకోని ఉన్నతాధికారులు

**రాష్ట్రంలో వరుస ప్రమాద ఘటనలు కంటి మీద కునుకు లేకుండా చేస్తున్నాయి. బుధవారం మధ్యాహ్నం అనకాపల్లి జిల్లాలోని అచ్యుతాపురం పార్మా కంపెనీలో రియాక్టర్ పేలి 18 మంది దుర్మరణం చెందగా.. సుమారు 50 మంది తీవ్రంగా గాయపడ్డారు. బుధవారం రాత్రి జిల్లాలోని ముత్తుకూరు మండలంలోని పంటపాలెంలో పామాయిల్ ఫ్యాక్టరీలో అగ్ని ప్రమాదం సంభవించింది. అదేవిధంగా కర్నూల్ జిల్లాలోని ఒక ఫ్యాక్టరీలో గురువారం మంటలు చెలరేగాయి. తిరుపతిలోని ఓ ప్రైవేట్ పాఠశాలలో అగ్ని ప్రమాదం జరిగింది.**



నెల్లూరు, మేజర్‌న్యూస్ ప్రతినిధి :

వరుస ప్రమాదాల నేపథ్యంలో నెల్లూరు జిల్లాలో కూడా అప్రమత్తంగా ఉండాల్సిన పరిస్థితి నెలకొంది. నెల్లూరు జిల్లాలోని ముత్తుకూరు మండలంలో పోర్టుతో పాటు పామాయిల్ ఫ్యాక్టరీ, థర్మల్ పవర్ స్టేషన్లు ఉన్నాయి. -మిగతా 8లో

## శ్రీవారిని దర్శించుకున్న మెగాస్టార్ చిరంజీవి, ఆనం కుటుంబం



**నెల్లూరు కలెక్టరేట్, మేజర్‌న్యూస్ :** కలియుగ ప్రత్యక్ష దైవం తిరుమల శ్రీవారిని ప్రముఖ హీరో చిరంజీవి, రాష్ట్ర దేవాదాయ శాఖ మంత్రి ఆనం రామనారాయణ రెడ్డి కుటుంబ సమేతంగా కలిసి గురువారం దర్శించుకున్నారు. ఈ సందర్భంగా ఆలయ అర్చకులు వారికి ఆలయ లాంఛనాలతో స్వాగతం పలికారు. ప్రత్యేక పూజలను నిర్వహించి స్వామి వారి ఆశీర్వాదాన్ని అందజేశారు. కార్యక్రమంలో జనసేన తిరుపతి ఎమ్మెల్యే ఆరణి శ్రీనివాసులు, కొండ్రెడ్డి రితేష్ కుమార్ రెడ్డి, ఆనం కైవల్యా రెడ్డి, తదితరులు పాల్గొన్నారు.

## రవాణా భారం తగ్గించేందుకు ధరలను నిర్దేశించాం

### జిల్లా కలెక్టర్ ఆనంద్

**నెల్లూరు కలెక్టరేట్, మేజర్‌న్యూస్ :** ప్రజలకు ఇసుక రవాణా భారం తగ్గించడానికి ఇసుక రవాణా ధరలు నిర్దేశించామని జరిగిందని జిల్లా కలెక్టర్ ఓ.ఆనంద్ వెల్లడించారు. గురువారం జిల్లా కలెక్టర్ ట్రాన్స్ పోర్ట్, రవాణా శాఖ అధికారులతో తిక్కన ప్రాంగణంలో సమావేశం నిర్వహించారు. అనంతరం విలేకరులతో మాట్లాడుతూ.. ప్రస్తుతం మన జిల్లాలో మర్రిపాడు సాండ్ డిపో పని చేస్తున్నదని, దీనిలో 36 వేల మెట్రిక్ టన్నుల ఇసుక అందుబాటులో ఉందని ఇక్కడి నుండి రోజుకు వెయ్యి టన్నులు ఇసుక సరఫరా అవుతున్నదన్నారు. స్టాక్ పాయింట్ దూరంగా ఉండటం వల్ల, ధర ఎక్కువగా ఉందని ప్రజల నుండి ఫిర్యాదులు వస్తున్నాయని అన్నారు. దీనిపై డిప్యూటీ ట్రాన్స్పోర్ట్ కమిషనర్ ద్వారా



ఇసుక (సీలింగ్ రేట్) రవాణా చార్జీలను ఫిక్స్ చేయడం జరిగిందన్నారు. ఈ రేట్లకు ట్రాన్స్పోర్టర్లు కూడా అంగీకరించారని కలెక్టర్ తెలిపారు. ఇసుకకు సంబంధించిన ఫిర్యాదులు ఉన్నట్లయితే టోల్ ఫ్రీ నెంబర్ 0861-2943569కు కానీ, dmgonelloresandcomplints@gmail.comకు ఫిర్యాదు చేయవచ్చన్నారు. స్టాక్ యార్డ్ వద్ద టన్ను ఇసుక ధర రూ.370గా ప్రభుత్వం నిర్ణయించిందన్నారు. మర్రిపాడు తహసిల్దార్ కార్యాలయం -మిగతా 2లో

## వీర్లగుడిపాడును ఆత్మకూరుకు మార్చాలన్నది

# కంఠశోషేనా !?



వరదల సమయంలో పడవలో పయనిస్తున్న దివంగత మంత్రి గౌతంరెడ్డి (ఫైల్‌ఫోటో)

**ఆత్మకూరు, మేజర్‌న్యూస్ :** వరదలు సంభవించినా, భారీ వర్షాలు కురిసినా, సోమశిల జలాశయం నుండి అధికనీటిని పెన్నానదికి విడుదల చేసినా ఆందోళనకు గురయ్యే గ్రామం, అందరికీ గుర్తుకు వచ్చే గ్రామం ఆత్మకూరు నియోజక వర్గంలోని సంగం మండలం వీర్లగుడిపాడు. ఈగ్రామం సమీపంలోని ఆత్మకూరు మండలంలోకి మార్చాలన్న ఆగ్రామస్తుల కోరిక కంఠశోషగానే మిగిలింది. కేవలం ఐదారువందల జనాభా, 400 మంది ఓటర్లు కలిగిన చిన్నగ్రామమైనా ఇరువైపులా పెన్నా, బగ్గేరు నదులు ఉండడంతో పుష్కలంగా సాగునీటి వసతి కలిగి పైర్లతో పచ్చదనం కళకళలాడుతూ కన్పిస్తుంటుంది. గతంలో వరి, కొబ్బరి, సపోటా, తమలపాకులు తదితర పంటలు అధికంగా ఉండేవి. కొంతకాలం క్రితం రొయ్యలు, చేపల గుంటలు కూడా అధికంగా తీసి కొనసాగించారు. క్రమేణా వాటిని కూడా తొలగించి వరిపైరు సాగుచేస్తున్నారు. తమలపాకు తోటలు పూర్తిగా లేకుండా పోయాయి. కొబ్బరిచెట్లు మాత్రం అధికంగా ఉన్నాయి. కాగా ఈ గ్రామానికి సంబంధించి పలు సమస్యలు అనాదిగా ఉన్నా నాయకులు హామీలివ్వడమే తప్ప వాటిని గురించి పట్టించుకున్న దాఖలాలు లేనేలేవు. వీర్లగుడిపాడు ఆత్మకూరుకు ఐదారు కిలోమీటర్ల దూరంలో ఉండగా మధ్యలో బగ్గేరు ఉంది. రాకపోకలు సాగించే అవకాశం లేదు. అదీగాక ఈ గ్రామం సంగం మండలంలో ఉంది. ఏ పనిబడినా మండల కేంద్రానికి వెళ్ళాలంటే ఆత్మకూరుమీదుగా 33 కిలోమీటర్లు ప్రయాణించాల్సి ఉంది. ఆత్మకూరు మండలంలో తమ గ్రామాన్ని చేర్చాలని, బగ్గేరుపై వంతెన నిర్మిస్తే కేవలం ఐదు కిలోమీటర్లలో ఆత్మకూరు ఉన్నందున, తమ అవసరాలన్నింటికి ఆత్మకూరే అయినందున ఎంతో సౌకర్యవంతంగా ఉంటుందని గ్రామస్థులు అనాదిగా చెబుతుండగా ఎన్నికల సమయంలో మాత్రం నాయకులు అలకించడం, అనంతరం మరిచిపోవడం సాగు తోంది. పెన్నా, బగ్గేరు నదుల మధ్య ఈ గ్రామం ఉండడంతో భారీ వర్షాలు కురిసినా, పైతట్టు ప్రాంతాల్లో వర్షాలు అధికమై సోమశిల జలాశయానికి నిండుగా చేరాక నీటిని పెన్నానదికి లక్షలాది క్యూసెక్కులు విడుదల చేస్తే నదీపరీవాహకంలో లోతట్టుగా ఉన్న వీర్లగుడిపాడు జలదిగ్గంధంకు గురికావడం, గ్రామంలోకి ఐదారు అడుగుల నీరు ప్రవేశించడం జరుగుతుంది. గ్రామంలో ఒకే ఒక కమ్యూనిటీహాల్ ఉండగా అందరూ అక్కడే తలదాచుకొని కాలంగడుపుతుంటారు. అధికారులు ఈవలవైపు చేరి ఆహారపదార్థాలు పడవలద్వారా చేరవేస్తుంటారు. అయితే ఇంతటి ఆందోళనకరమైన పరిస్థితిలో ఈ గ్రామాన్ని సురక్షిత ప్రాంతానికి తరలించాలంటే సారవంతమైన నేలలు, పుష్కలమైన సాగునీరు, ఏడాదిపొడవునా పంటలు అంటూ గ్రామస్థులు తిరస్కరిస్తుంటారు. చిన్న గ్రామమైనా పాడిపంటలతో గ్రామస్థులకు లాభసాటిమాత్రమే కాకుండా రవాణాదారులకు, వాహనాలకు, విద్యుత్‌చార్జీలు రూపేణా అధికంగా ప్రభుత్వానికి ఆదాయం వస్తుంది. కూలీలకు నిత్యం ఉపాధి ఉంటుంది. అలాంటి గ్రామం పలు సమస్యలతో సతమతమవుతున్నా ప్రభుత్వాలు ప్రత్యేక దృష్టిసారించి ఆత్మకూరు మండలంలో చేర్చడం, బగ్గేరుపై వంతెన నిర్మించడం, వరదల దృష్ట్యా ఒక పక్కా పునరావాసకేంద్రం నిర్మించడం తదితర చర్యలు తీసుకోవడం లేదని అందరూ వాపోతున్నారు. గత వరదల సమయంలో అప్పటి రాష్ట్ర మంత్రి మేకపాటి గౌతంరెడ్డి పడవలో ఆగ్రామానికి వెళ్ళి ప్రజలను పరామర్శించగా తమ అవసరాలను గురించి వారు వివరించగా బగ్గేరుపై వంతెన గ్రామాన్ని ఆత్మకూరు మండలంలో చేర్పించడం తదితరాల గురించి హామీ ఇచ్చారు. అయితే ఆయన గుండెపోటుకు గురై హఠాన్మరణం పొందారు. దివంగత గౌతంరెడ్డి స్థానంలో వారసుడుగా వచ్చిన స్థానిక ఎమ్మెల్యే మేకపాటి విక్రమ్‌రెడ్డి కూడా ఈ గ్రామం గురించి స్పందించలేదు. ఈ నూతన ప్రభుత్వంలో అత్మకూరు అభివృద్ధి ప్రదాత, ఇలాంటి సమస్యలను సునాయాసంగా తీర్చగలిగే సమర్థ నాయకుడు ఆనం రామనారాయణరెడ్డి ఇక్కడ ఎమ్మెల్యేగా, రాష్ట్రమంత్రివర్గంలో దేవాదాయశాఖామంత్రిగా ఉన్నారు. ఆయన తలచుకుంటూ ఈసమస్య పరిష్కారమవుతుందని ఆగ్రామస్థులు గంపెడాశలు పెట్టుకొని ఉన్నారు. ఆయన స్పందిస్తారేమో చూడాల్సి ఉంది.

## సంగం బ్యారేజ్‌కు గౌతంరెడ్డి పేరు

# మార్చడం దారుణం



**ఆత్మకూరు, మేజర్‌న్యూస్ :** ఆత్మకూరు ప్రజల మన్ననలు పొంది విశేష ఆదరాభిమానాలతో రెండుమార్లు ఎమ్మెల్యేగా అత్యధిక మెజారిటీతో విజయం సాధించిన దివంగత మంత్రి మేకపాటి గౌతమ్ రెడ్డి పేరును సంగం బ్యారేజ్‌కు పెట్టడం సముచితమని ఆ పేరును మార్చాలని కూటమి ప్రభుత్వ నిర్ణయం దారుణమని వైఎస్సార్సీపీ పట్టణ పార్టీ అధ్యక్షుడు అల్లారెడ్డి ఆనంద్ రెడ్డి పేర్కొన్నారు. ఈ మేరకు ఆయన గురువారం మాట్లాడుతూ.. బ్యారేజ్ నిర్మాణ పనులు వేగవంతం చేయడంలో అప్పట్లో మంత్రిగా గౌతమ్ రెడ్డి విశేష కృషి చేశారన్నారు. చిన్నవయసులోనే మంత్రిగా, ప్రతిపక్ష ఎమ్మెల్యేగా అన్ని రాజకీయ పార్టీల నుంచి మంచి పేరు తెచ్చుకున్నారన్నారు. ఆయన మృతి చెందిన సమయంలో పట్టణంలో ఏర్పాటు చేసిన సంస్మరణ సభలో ప్రతిపక్ష పార్టీకి చెందిన నాయకులు హాజరై ఆయనకు ఘన నివాళి అర్పించిన విషయాన్ని గుర్తుచుకోవాలని, అందరికి మంచి చేసిన అలాంటి వ్యక్తి పేరును బ్యారేజ్‌కు కొనసాగించేలా ప్రతి ఒక్కరూ నిర్ణయం తీసుకోవాలన్నారు. అజాత శత్రువుగా గుర్తింపబడ్డారని అటువంటి గౌతమ్ రెడ్డి పేరును బ్యారేజ్‌కు తొలగించడం మంచి పరిణామం కాదని ఆయన అన్నారు. ఇప్పటికైనా కూటమి ప్రభుత్వం తన నిర్ణయం మార్చుకోవాలని ఆయన హితవు పలికారు.

## రవాణా భారం తగ్గించేందుకు ధరలను నిర్దేశించాం

(మొదటి పేజీ తరువాయి)

వద్ద బుకింగ్ పాయింట్ ఏర్పాటు చేయడం జరిగిందని, అక్కడ ఒక ఉద్యోగిని నియమించడం జరిగిందన్నారు. ఇసుక రవాణా చేసే వాహనాలను మైన్స్ శాఖ ద్వారా ఎంప్యానల్ చేయడం జరిగిందని, ఇసుక కావలసినవారు అందుబాటులో ఉన్న ఎంప్యానల్డ్ వాహనాలను బుక్ చేసుకుని కానీ, సొంత వాహనాల ద్వారా కానీ ఇసుక తీసుకోవచ్చన్నారు. ఇసుక సరఫరా, అధిక రేట్లు వసూలు చేసిన, రవాణాలో అక్రమాలకు పాల్పడినట్లయితే సెబ్, పోలీస్ అధికారులు తగిన చర్యలు తీసుకుంటారని కలెక్టర్ వెల్లడించారు.

పది టన్నుల కెపాసిటీ కలిగిన ఆరు టైర్ల లారీకి 0-5 కి.మీలకు రూ.1500, 6-15 కిలోమీటర్లకు రూ.2 వేలు, 16-30 కి.మీలకు రూ.3500, 31-45 కి.మీలకు రూ.4500, 46-60 కి.మీలకు రూ.5500, 60 కి.మీల కంటే ఎక్కువ దూరం ఉంటే ప్రతి టన్నుకు, కిలోమీటర్‌కు 9 రూపాయల చొప్పున నిర్ధారించడం జరిగిందన్నారు. అలాగే 18 టన్నుల కెపాసిటీ కలిగిన పది టైర్ల లారీకి 0-5 కి.మీలకు రూ.2వేలు, 6-15 కి.మీలకు రూ.3వేలు, 16-30 కి.మీలకు రూ.5వేలు, 31-45 కి.మీలకు రూ.7500, 46-60 కి.మీలకు రూ.8500, 60 కి.మీలకు పైన ఉంటే ప్రతి టన్నుకు కి.మీలకు రూ7.50 నిర్ధారించారన్నారు. 21 టన్నుల సామర్ధ్యం కలిగిన 12 టైర్ల లారీకి 0-5 కి.మీలకు రూ.2500, 6-15 కి.మీలకు రూ.4వేలు, 16-30 కి.మీలకు రూ.6వేలు, 31-45 కి.మీలకు రూ.8వేలు, 46-60 కి.మీలకు రూ.10వేలు, అదనపు కి.మీలకు టన్నుకు, కి.మీలకు రూ.7.50గా నిర్ధారించారు. 4 టన్నుల సామర్థ్యం కలిగిన ట్రాక్టరు ట్రాలీకి 0-5 కి.మీలకు రూ.800, 6-15 కి.మీలకు రూ.1500, 16-30 కి.మీలకు 2400, 31-45 కి.మీలకు రూ.3వేలు, 46-60 కి.మీలకు రూ.3500, అదనపు కి.మీలకు టన్నుకు కిమీ రూ.12గా నిర్ధారించడం జరిగిందన్నారు.



జిఎస్‌టిచెల్లించాలంటూ కేంద్ర ప్రభుత్వ చిహ్నంతో వచ్చిన మెసేజ్

Dear, Taxpayer,
Your Amount is successfully Received by RBI.
We are please to inform you that transaction is still not clear due to your GST of your transaction of Rs, 30,000 INR.is not submitted, so kindely submit your charge
Rs. 3,500

NOTE: ALL PAYMENT REFUND ON YOUR ACCOUNT AFTER CLEAR LOAN WITHIN 15 MINS.. REFUNDABLE AMOUNT RS. 3150+5500+3500 =42,150

# ఇంటర్నెట్‌తో ఘరానా మోసాలు

## నిత్యం మెసేజ్‌లమయం

**ఆత్మకూరు, మేజర్‌న్యూస్ :** ఆండ్రాయిడ్ ఫోన్ ఉందంటే వివిధ సమాచారాలు పొందడం, ఇతరులకు చేరవేయడం తదితర పరిణామాలు ఎంతో సౌకర్యవంతంగా ఉంటాయని అందరూ భావిస్తుండడం, అత్యధిక శాతం మంది ఆండ్రాయిడ్ మొబైల్ ఫోన్‌నే విని యోగిస్తుండడం తెల్సిందే. కాగా పొద్దస్తమానం రకరకాల కంపెనీలకు చెందిన అనేక మెసేజ్‌లు వస్తుంటాయి. వాటిలో ఏదేని సమాచారం అయితే పర్వాలేదు కానీ పలువురిని ఆకర్షింపజేసే మెస్సేజ్‌లతో విసుగు చెందడం, కొంద్రరైతే మోసపోతుండడం, నష్టపోతుండడం కొనసాగుతుంది. ఇలాంటి ఇంటర్నెట్ మెస్సేజ్‌లు కేంద్ర ప్రభుత్వ చిహ్నం, రిజర్వు బ్యాంకు, వివిధ జాతీయ బ్యాంకుల చిహ్నాలతో ఉంటుండడంతో సునాయాసంగా మోసపోయే పరిస్థితి కలుగుతోంది. మీఫోన్ నెంబర్ విజేతగా ఎంపికైనందున జాక్‌పాట్, లేదా స్పిన్నర్స్ గేమ్‌లు ఆడడం ద్వారా అత్యంత విలువైన బహుమతులందుకోవచ్చని మెస్సేజ్ లు వస్తుంటాయి. మీరు 10 నిముషాల్లో ఎలాంటి డాక్యుమెంట్లు లేకుండా కోటి రూపాయల వరకు రుణసౌకర్యం అంటూ ఇబ్బడి ముబ్బడిగా మెస్సేజ్‌లు వస్తుంటాయి. కొందరైతే తమ అవసరాన్నిబట్టి ఆ మెసేజ్‌ల్లో సూచించిన ప్రకారం అనుసరించడం, వారు సూచించిన విధంగా నగదు చెల్లించి చివరకు మోసపోవడం జరుగుతోంది. అదీగాక ప్రముఖ బ్యాంకుల చిహ్నాలతో ఫోన్‌నెంబర్లు వాట్స్‌యాప్‌లో కన్పించడం, అది బ్యాంకుదేనని భావించి పలువురు ఏదేని మార్పులు, చేర్పులకు ఫోన్‌చేయడం, ఓటిపి నెంబరు అడిగితే చెప్పడం, మరుక్షణానికల్లా వారి ఖాతాల్లోని నగదును లక్షలాది రూపాయలుగా కాజేయడం జరుగుతోంది. ఇలాంటి సంఘటనలు ఆత్మకూరులో ఐదారు జరిగాయి. ఆరా తీస్తే ఇతర రాష్ట్రాల నుండి మోసం జరిగినట్లుగా తెలుస్తోంది. ఇలాంటి గుర్తింపు కలిగిన చిహ్నాలతో మోసగించేవారిని నిఘావర్గాలు దృష్టి సారించి గుర్తించి చర్యలు తీసుకోవాలని పలువురు కోరుతున్నారు.

## గణిత ఉపాధ్యాయుడికి ఇస్రో ప్రశంసా పత్రం

**అనంతసాగరం, మేజర్‌న్యూస్ :** చిలకల మర్రి గ్రామంలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల గణిత ఉపాధ్యాయుడు చల్లా చంద్రశేఖర్‌రెడ్డికి ఇస్రో సంస్థ నుండి ప్రశంసా పత్రం అందింది. జాతీయ అంతరిక్ష దినోత్సవం పురస్కరించుకొని నిర్వహించిన క్విజ్ పోటీలో పాల్గొని ప్రతిభ కనబరిచిన ఉపాధ్యాయుడికి ఇస్రో చైర్మన్ డాక్టర్ ఎస్. సోమనాథ్ నుండి అభినందనలు తెలుపుతూ ప్రశంస పత్రం రావడం జరిగింది. సందర్భంగా మండల ఎంఈఓలు ఎం.వి జానకిరామ్, కాటంరెడ్డి ప్రభాకర్‌రెడ్డిలు, మండలంలోని ఆయా పాఠశాలల ఉపాధ్యాయులు, గ్రామస్తులు, స్నేహితులు అభినందనలు తెలిపారు.

## సచివాలయానికి సీఎం, డిప్యూటీ సీఎం చిత్రపటాలు



**మర్రిపాడు, మేజర్‌న్యూస్:** మర్రిపాడు మండలం ఇర్లపాడు సచివాలయానికి సచివాలయం పరిధిలో కూటమి నాయకులు కలిసి సీఎం చంద్రబాబు నాయుడు, ఉప ముఖ్యమంత్రి కొణిదెల పవన్‌కళ్యాణ్ చిత్రపటాలను సచివాలయం సిబ్బందికి గురువారం అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. రాష్ట్ర అభివృద్ధికి సీఎం, డిప్యూటీ సీఎంలు ఎంతగానో కృషి చేస్తున్నారన్నారు. ప్రభుత్వం ఏర్పడి అతి కొద్ది రోజుల్లోనే పథకాలను అమలు చేస్తూ ప్రజలకు అందుబాటులో ఉంటూ సమస్యలను నెరవేరుస్తున్న ఘనతను ప్రజలు గమనిస్తున్నారన్నారు. కార్యక్రమంలో జనసేన నియోజకవర్గ ఉప ఇంచార్జ్ దబ్బుకొట్టు నాగరాజ్ యాదవ్, టిడిపి సీనియర్ నాయకులు గుర్రం నాగేశ్వరావు యాదవ్, గ్రామ సర్పంచ్ గుర్రం శ్రీనివాస్ యాదవ్, జనసేన మండల ప్రధాన కార్యదర్శి దబ్బు కొట్టు సునీల్ కుమార్ యాదవ్, మాజీ సర్పంచ్ గుర్రం పెంచలయ్య యాదవ్, సచివాలయం సిబ్బంది హరీష్, ఎస్.కె రహమత్ బాషా, రుక్మిణి, కవిత తదితరులు పాల్గొన్నారు.

# ఆత్మకూరులో తరచూ ట్రాఫిక్ ఇక్కట్లు





**ఆత్మకూరు, మేజర్‌న్యూస్ :** ఆత్మకూరు పట్టణంలోని ప్రధాన రహదారిపై నిత్యం ట్రాఫిక్ స్థంభిస్తూ.. వాహనకారులు, ద్విచక్రవాహనకారులు, పాదచారులు అవస్థలు పడుతున్నారు. గతంలో రోడ్డును విస్తరించినా.. ఎక్కడబడితే అక్కడే దుకాణాల ముందు వాహనాలు నిలుపుతుండడం, సోమశిల రోడ్డు సెంటర్‌వద్ద వాహనాలు అనంతసాగరం వైపు వెళ్ళాల్సిరావడం, అదీగాక ప్రాజెక్టు వద్దకు భారీ వాహనాలు వెళ్ళే సమయంలో మలుపు వద్ద నిలిచిపోతుండడం, పోలీస్‌స్టేషన్ ఎదుట మలుపువద్ద తరచూ వాహనాలు ఎదురెదురు వచ్చిన సమయంలో నిలిచిపోతుండడం తదితర కారణాలతో తరచూ ట్రాఫిక్ స్థంభిస్తుంటుంది. ఎక్కువగా సోమశిల రోడ్డు సెంటర్ వద్దనే ట్రాఫిక్ స్థంభిస్తుంటుంది. గతంలో దుకాణాల యజమానులు సక్రమంగా సహకరించనందున రోడ్డును ఎక్కువగా విస్తరించలేకపోయారు. మధ్యలో డివైడర్లు ఏర్పాటు చేయడం, ఇరువైపులా దుకాణాల ముందు ద్విచక్ర, ఇతర వాహనాలను నిలుపుతుండడం, రోడ్డు అంచుల్లో తోపుడుబండ్ల వ్యాపారాలు తదితరాలతో ట్రాఫిక్ అవస్థలు తప్పడం లేదు. ఈవిషయమై మున్సిపల్, పోలీస్ అధికారులు దృష్టి సారించి పరిస్థితిని గమనించి తగు చర్యలు తీసుకోవాల్సిన అవసరం ఎంతైనా ఉంది.

# విద్యార్థి మృతికి కారణం ప్రధానోపాధ్యాయుడంటూ సస్పెండ్

## 26 పేజీల నివేదిక ఏం చెప్పింది - బాధ్యతారహిత్యం అయితే ఫలితాలు ఎలా వస్తాయి ?



గోడ కూలి మృతి చెందిన గురు మహేంద్ర వద్ద రోదిస్తున్న బంధువులు (ఫైల్‌ఫోటో)

**నెల్లూరు విద్య, మేజర్‌న్యూస్ :** నెల్లూరు నగరంలోని బీవీనగర్ లోని కేఎన్‌ఆర్ మున్సిపల్ పాఠశాలలో గత నెల జూలై 26న గోడ కూలి తొమ్మిదవ తరగతి విద్యార్థి గురు మహేంద్ర(14) మృతి చెందిన విషయం విధితమే. ఆరోజు ఈ విషయంపై జిల్లా మంత్రి నారాయణ ఘటనపై విచారణ జరిపి ఇత్తకు చర్యలు తీసుకోవాలని ఆదేశాలు జారీ చేయడంతో కలెక్టర్ డీఈఓ కు విచారణ చేసి బాధ్యులపై చర్యలు తీసుకోవాలని ఆదేశాలు ఇచ్చారు. పాఠశాలలో ఈ దుర్ఘటన జరగటం బాధాకరమే కానీ ఆ ఘటనకు హెచ్‌ఎం కు మాత్రమే సంబంధం ఉందా..? లేదా...? అన్న విషయాన్ని అన్ని కోణాల్లో పరిశీలించి నివేదిక ఇవ్వాల్సి ఉంది. జులై 26 పాఠశాల సమయం సాయంత్రం నాలుగు గంటలకు ముగిసింది. ఘటన నాలుగు గంటలకు పైన జరిగింది. పాఠశాల పని వేడుకలు అయిపోయిన తర్వాత పిల్లలు పిల్లలు ఆడుకుంటూ చెప్పులు విసురుకోవటం చనిపోయిన విద్యార్థి చెప్పు భవన లింటల్ లెవెల్ సన్ సైడ్ క్రింద పడటం ఆ చెప్పు కోసం విద్యార్థి వెళ్లటం ఆ నిర్మాణం సరిగా లేకపోవడంతో ఆ సన్ సైడ్ గోల విద్యార్థి పై కూలి విద్యార్థి మరణించాడు. నెల్లూరు రూరల్ నియోజకవర్గంలోని కెఎన్‌ఆర్ మున్సిపల్ పాఠశాల జిల్లాలోని ప్రభుత్వ పాఠశాలలో జిల్లాలో రాష్ట్రస్థాయిలో పేరు ప్రతిష్టలు సంపాదించింది. కార్పొరేట్ పాఠశాలలకు దీటుగా ఒక మున్సిపల్ పాఠశాల రాష్ట్రస్థాయిలో ప్రభంజనం సృష్టించటం ప్రభుత్వానికే గర్వకారణం. అయితే కెఎన్‌ఆర్ పాఠశాలలో విద్యార్థులు అధిక సంఖ్యలో చేరటం,దానికి తగినంత వసతులు లేకపోవడం కూడా ఒక కారణం, ఈ విద్యా సంవత్సరంలో సుమారు 1800 మంది విద్యార్థిని విద్యార్థులు ఈ పాఠశాలల విద్యనభ్యసిస్తున్నారు. పెద్ద కేఎన్‌ఆర్ చిన్న కేఎన్‌ఆర్ అని రెండు ప్రాంగణాలు అయినాయి. నాడు నేడు కింద గత ప్రభుత్వంలో పాఠశాలల అభివృద్ధి పనులు జరిగాయి అందులో భాగంగా కేఎన్‌ఆర్ స్కూల్లో కూడా ఈ నిర్మాణ పనులు చేపడుతున్నారు,అయితే బిల్లులు రాలేదని కాంట్రాక్ట్ ఆ పనులు నిలిపివేయడం, దాన్ని పట్టించుకోకపోవడంతో ఈ దుర్ఘటన జరగటం వాస్తవం. కాంట్రాక్టు పనులు చేసింది గవర్నమెంట్ సచివాలయం ఇంజనీరింగ్ సిబ్బంది, ఆ విషయాన్ని జాగ్రత్తగా గమనించవలసిన బాధ్యత ఇంజనీర్ కు లేదా...?? అసలు 1800 మంది విద్యార్థిని విద్యార్థులు చదివే పాఠశాలలో 48 మంది ఉపాధ్యాయులు ఉండాల్సింది 22 మంది ఉపాధ్యాయులు ఉంటే విద్యార్థులు పురోగతి.. విద్యార్థుల భవిష్యత్తు ఏమవుతుంది మరి..? 2022లో పదవ తరగతి ఫలితాల్లో ఎం తర్శశ్రీ అనే విద్యార్థిని590 మార్కులు సాధించింది, 20 23లో గోకుల కృష్ణ అనే విద్యార్థి593 మార్కులు సాధించాడు, 2024లో 10వ తరగతి ఫలితాల్లో కే స్వాతి శ్రీనిధి 594 మార్కులతో స్టేట్ ర్యాంక్ సాధించింది. మరి ప్రధానోపాధ్యాయుడు బాధ్యతతో పని చేయకపోతే ఈ ఫలితాలు వస్తాయా.. కేవలం ఒక దుర్ఘటన జరిగినంత మాత్రాన్ని దాన్ని అతడిని బాధ్యున్ని చేయటం సమంజసమా, 26 పేజీల నివేదిక నిజమైన నివేదికెనా..? చిన్నప్పుడు పెద్దలు చెప్పిన కథ లాగా చేప చేపా ఎందుకు ఎండలేదు అంటే గడ్డి అడ్డం వచ్చింది.. గడ్డి గడ్డి ఎందుకు అడ్డం వచ్చావంటే ఆవు మెయ్య లేదు.. అన్న కథలా గత ప్రభుత్వ లోని కాంట్రాక్టర్, సచివాలయ ఇంజనీర్ నిర్లక్ష్యపు ధోరణికి హెచ్‌ఎం ని బాధ్యున్ని చేస్తూ సస్పెండ్ చేయడం సమంజసమా..?

# అత్యాచార నిందితులను కఠినంగా శిక్షించాలి




**అనంతసాగరం, మేజర్‌న్యూస్ :** కలకత్తా నగరంలో అతి పాశవికంగా జూనియర్ మహిళా డాక్టర్‌పై అత్యాచారం చేసిన నిందితులను కఠినంగా శిక్షించాలని అనంతసాగరంలో గురువారం సిఐటియు, ప్రజా సంఘాల ఐక్యవేదిక ర్యాలీ చేపట్టారు. నేడు సమాజంలో మహిళలపై లైంగిక దాడులు, వేధింపులు, అఘాయిత్యాలు తీవ్రతరం అవుతున్న రాష్ట్ర, కేంద్ర ప్రభుత్వాలు తక్షణ కఠిన చర్యలు తీసుకోవడం లేదని సిఐటియు మండల కార్యదర్శి అన్వర్ బాషా అన్నారు. మహిళలు అభద్రతా భావంతో బతుకుతుండటం సరి కాదన్నారు. నిందితులను బయటికి రాకుండా అక్కడి ప్రభుత్వం చేస్తున్న తీరు సభ్య సమాజం తలదించుకునేలా చేసింది అన్నారు. నిందితులను వెంటనే కఠినంగా శిక్షించాలని, చట్టాలను మరింత పటిష్టం చేయాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో జేవీవీ నాయకులు వేము పెంచలయ్య, గాడి సుధాకర్, రైతు సంఘం మండల కార్యదర్శి ఉప్పలపాడు మస్తాన్, సిఐటియు మండల అధ్యక్షుడు మీరా మొహిద్దీన్, అంగన్వాడి వర్కర్లు, హెల్పర్లు, వెలుగు వీఓఏలు తదితరులు పాల్గొన్నారు.

# ప్రకృతి వ్యవసాయాన్ని అధ్యయనం చేసిన ఇంజనీరింగ్ విద్యార్థులు



**ఆత్మకూరు, మేజర్‌న్యూస్ :** ఆత్మకూరులోని ఆంధ్రాఇంజనీరింగ్ కాలేజి విద్యార్థులు తమ ప్రాజెక్ట్ కార్యక్రమంలో భాగంగా మండలంలోని కరటంపాడులో ప్రకృతి వ్యవసాయం ద్వారా సాగు చేసిన పైర్లు, విధానాల గురించి అధ్యయనం చేశారు. కరటంపాడు రైతు భరోసా కేంద్రం ఆధ్వర్యంలో ప్రకృతి వ్యవసాయ పథకం సిబ్బంది ఆ విద్యార్థులకు పొలాల్లో పైర్లను చూపి క్షేత్ర పరిశీలన చేయించారు. ప్రకృతి వ్యవసాయం చేసే విధానాలు గురించి వివరించారు. ఎలాంటి రసాయనిక ఎరువులు, పురుగుల మందులు లేకుండా సాగుచేసే విధానం, తద్వారా లభించే ఆరోగ్యకరమైన ఉత్పత్తులు గురించి, వ్యయం తక్కువ, దిగుబడులు ఎక్కువ అనే అవ:ఆలను గురించి వారు వివరించారు. భీజామృతం ద్వారా విత్తనశుద్ధి, సేంద్రియ ఎరువులు తదితరాలు, తెగుళ్ళ నివారణకు కషాయం తయారు చేసి వినియోగించడం గురించి వారు విద్యార్థులకు వివరించారు. వారంతా ఆ వివరాలను నమోదు చేసుకున్నారు. కార్యక్రమంలో ప్రకృతి వ్యవసాయ సిబ్బంది ఎం.సుబ్బమ్మ, పుట్టుబోయిన సుబ్బరాయుడు, నాగరాజు, దొరసానమ్మ, రైతు భరోసా కేంద్ర ప్రతినిధులు, ఇంజనీరింగ్ విద్యార్థినీ విద్యార్థులు పాల్గొన్నారు.

# రైతు సేవ కేంద్రాలను సద్వినియోగం చేసుకోండి

## వ్యవసాయ శాఖ అధికారులు రైతులకు సలహా




**ముత్తుకూరు, మేజర్‌న్యూస్ :** రైతు సేవా కేంద్రాలను రైతులు సద్వినియోగం చేసుకోవాలని జిల్లా వ్యవసాయ శాఖ అధికారులు శైలజ అన్నారు. గురువారం మండలంలోని తాళ్లపూడి, బ్రహ్మదేవం, మల్లూరు గ్రామాల్లో రైతులకు రైతు శిక్షణ కార్యక్రమాలు వ్యవసాయ శాఖ నిర్వహించింది. ప్రత్యామ్నాయ పంటలపై అవగాహన కల్పించారు. నవధాన్యాలను కూడా ప్రత్యామ్నాయ పంటలుగా సాగు చేసుకోవచ్చని సూచించారు. కార్యక్రమంలో శాస్త్రవేత్తలు కిరణ్, ఏడిఏ రాజకుమార్, ఏఓ జోత్స్న రాణి, సహాయకులు శ్రీనివాసులు తదితరులు పాల్గొన్నారు.

# పాడి రైతులను ప్రోత్సహించడమే ప్రభుత్వ లక్ష్యం



**వరికుంటపాడు, మేజర్‌న్యూస్ :** మండలంలోని గ్రామీణ ప్రాంత ప్రజలు ముఖ్యమైన జీవనోపాధి పాడి పరిశ్రమ అయినందున వారికి మేలు చేయాలని ఉద్దేశంతో రాష్ట్ర ముఖ్యమంత్రి చంద్రబాబు ఉపాధి హామీ పథకం ద్వారా మినీ గోకులంలు రాయితీపై ప్రభుత్వం అందిస్తుందని టీడీపీ యువ నాయకులు మారినేని రామకృష్ణ అన్నారు. మండలంలోని పాడి రైతులు పశు పోషకులు గొర్రెలు, మేకల పెంపకదారులు, కోళ్ల ఫారం రైతులు మినీ గోకులంలు సద్వినియోగం చేసుకొని పాడి పరిశ్రమను మరింతగా అభివృద్ధి చేసుకోవాలని తెలియజేశారు. వర్షాకాలం పాడి రైతులు పశువులకు షెడ్లు లేక తీవ్ర ఇబ్బందులకు గురవుతున్నారన్నారు. అందుకోసం రాష్ట్ర ప్రభుత్వం పాడి రైతులను ఆదుకోవాలని ఉద్దేశంతో మినీ గోకులం షెడ్ల నిర్మాణానికి ప్రభుత్వం రాయితీపై ప్రోత్సహిస్తుందని తెలిపారు. మండలంలోని ప్రజలందరూ సద్వినియోగం చేసుకోవాలని తెలిపారు. పాడి రైతులకు మినీ గోకులంలు పై సందేహాలుంటే సమీపంలోని పశు వైద్యాధికారిని సంప్రదించి వివరాలు తెలుసుకోవాలని కోరారు.

## నూతన ఎంపీడీవోగా బాధ్యతలు స్వీకరణ

**ఎంపీడీవో యన్.మల్లికార్జున**



**వరికుంటపాడు మేజర్ న్యూస్ :** వరికుంటపాడు మండల పరిషత్ కార్యాలయంలో ఎంపీడీవో గా యన్.మల్లికార్జున నూతనంగా బాధ్యతలను స్వీకరించారు ఈ సందర్భంగా కార్యాలయం సిబ్బంది ఘనంగా స్వాగతం పలికారు ఈ సందర్భంగా ఎంపీడీవో మల్లికార్జున మాట్లాడుతూ నూతనంగా బాధ్యతలు స్వీకరణ సందర్భంగా మండలంలోని ప్రతి గ్రామ ప్రజలకు ఎల్లవేళలా అందుబాటులో ఉంటానని తన కర్తవ్యాన్ని సక్రమంగా నిర్వహిస్తానని తెలియజేశారు.

## అతిథి ఉపాధ్యాయ పోస్టులకు దరఖాస్తుల ఆహ్వానం

**ఉదయగిరి మేజర్ న్యూస్ :** మండలంలోని గండిపాళెం గురుకుల పాఠశాలలో ఖాళీగా ఉన్న అతిథి ఉపాధ్యాయ పోస్టులకు దరఖాస్తు చేసుకోవాలని ప్రిన్సిపాల్ పుష్పరాజ్ గురువారం ఓ ప్రకటనలో పేర్కొన్నారు. తెలుగు పీజీటీ, గణితం పీజీటీ, స్టాఫ్ నర్సు పోస్టులు ఖాళీగా ఉన్నాయన్నారు. 2018 డీఎస్సీ నియమ. నిబంధనల ప్రకారం ఈనెల 27వ తేదీలోపు తమ వివరాలతో కూడిన దరఖాస్తులను పాఠశాలలో అందజేయాలన్నారు. జిల్లా ఉప విద్యాశాఖాధికారి ఆధ్వర్యంలో కమిటీ ద్వారా డెమో తరగతుల ఆధారంగా తీసుకొని ఎంపిక చేయడం జరుగుతుందన్నారు. ఆసక్తిగల వారు దరఖాస్తు చేసుకోవాలని ఆయన కోరారు.

## బాల కార్మికులచే పనులు నిర్వహిస్తే కఠిన చర్యలు తప్పవు

**- సూర్యవార్తకు స్పందించి ఇటుక రాయి బట్టిని పరిశీలించిన జిల్లా అధికారులు -ఇటుక బట్టీలకు అనుమతులు తప్పనిసరి**



**తోటపల్లిగూడూరు మేజర్ న్యూస్ :** మండలం ఇస్కపాలెం గ్రామ పంచాయితీలో 6 ఎకరాల లో నిర్వహిస్తున్న ఇటుకల బట్టి లో చిన్న పిల్లలు బాల కార్మికులుగా పనిచేస్తున్నారన్న విషయం బుధవారం సూర్య దినపత్రికలో ప్రచురితమైన విషయం తెలుసుకున్న డిస్ట్రిక్ట్ చైల్డ్ ప్రొటెక్షన్ ఆఫీసర్ సురేష్,అడిషనల్ లేబర్ ఆఫీసర్ రామారావు గురువారం తోటపల్లిగూడూరు ఇస్కపాలెం గ్రామ పంచాయతీ పరిధిలో రైస్ మిల్లు కు సమీపంలో ఎటువంటి అనుమతులు లేకుండా నిర్వహిస్తున్న పులివర్తి శోభనాద్రి చెందిన ఇటుకుల బట్టిని పరిశీలించారు ఈ విషయమై బట్టి యజమాని ని ప్రశ్నించగా ఆరోపించిన విధంగా ఇక్కడ ఎటువంటి బాలకార్మికులు లేరు అని, బుధవారం బంద్ కారణంగా అక్కడ కూలి పని చేస్తున్న వారి పిల్లలు బట్టి ప్రాంగణం లోకి రావడం జరిగిందని యజమాని బుకాయించారు, ఈ సందర్భంగా అధికారులు మాట్లాడుతూ, అధికారి సురేష్ మాట్లాడుతూ ఇలాంటి ఆరోపణలు మళ్ళీ అధికారుల దృష్టికి వస్తే కఠిన శిక్షలు తీసుకుంటామని బట్టి యజమాని పులివర్తి శోభనాద్రిని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో డిస్టిక్ చైల్డ్ ప్రొటెక్షన్ ఆఫీసర్ సురేష్, అడిషనల్ లేబర్ ఆఫీసర్ రామారావు, ఏహెచ్‌టియు ఏఎస్ఐ సతీష్, ఐసిడిఎస్ సూపర్వైజర్ సమత,మహిళ కానిస్టేబుల్ సుజాత, అంగన్వాడి టీచర్లు పాల్గొన్నారు.

## సీఐకి ఘన సన్మానం

**ఉదయగిరి మేజర్ న్యూస్.** విధి నిర్వహణలో ఉత్తమ ప్రతిభ కనపరిచి



స్వాతంత్ర్య దినోత్సవ వేడుకల్లో భాగంగా మంత్రి పొంగూరు నారాయణ, జిల్లా ఎస్పీ కృష్ణకాంత్ చేతుల మీదుగా పోలీసు సేవా పతకం పొందిన ఉదయగిరి సీఐ వేల్పుల గిరిబాబును స్థానిక సర్కిల్ కార్యాలయంలో గురువారం దుత్తలూరు మండల టీడీపీ నాయకులు ఘ నంగా సన్మానించి చిత్రపటాన్ని బహుకరించారు. ఈ కార్యక్రమంలో ఉద యగిరి నియోజకర్గ టీడీపీ అధికార ప్రతినిధి చల్లా ప్రసాద్, మాజీ జడ్పీటీసీ సభ్యులు చీదర్ల మల్లికార్జున, మండల ఎస్సీ సెల్ అధ్యకుడు యనమల రత్తయ్య తదితరులు పాల్గొన్నారు.

## పర్యావరణ పరిరక్షణకు నిరంతరం కృషి చేస్తామని వెల్లడించిన సీఈఓ జిజే రావు

**దేశంలోనే మొట్టమొదటిసారి**

**అదాని కృష్ణపట్నం పోర్టు ఎలక్ట్రికల్ లోడర్ ప్రారంభం**

**వారం రోజుల్లో మరో రెండు ఎలక్ట్రికల్ లోడర్లు రాక**



**ముత్తుకూరు ఆగస్టు 22 (మేజర్ న్యూస్):** అదాని కృష్ణపట్నం పోర్ట్ లో పర్యావరణ పరిరక్షణ కోసం నిరంతరం కృషి చేస్తామని సీఈఓ జి జె రావు వెల్లడించారు. కృష్ణపట్నం పోర్టులో గురువారం ఎలక్ట్రికల్ వోల్వో లోడర్ ను ఆయన ప్రారంభించడం జరిగింది. ఈ సందర్భంగా సీఈఓ మాట్లాడుతూ దేశంలో ఏ పోర్టు లేని విధంగా మొట్టమొదటిసారిగా కృష్ణపట్నం పోర్టులో ఎలక్ట్రికల్ లోడర్లు ఉపయోగించడం ఎంతో సంతోషంగా ఉందని తెలిపారు. ఎలక్ట్రికల్ లోడర్ వలన కాలుష్య నివారణతో పాటు పర్యావరణానికి మేలు జరుగుతుందని ఆయన పేర్కొన్నారు. పర్యావరణ పరిరక్షణలో భాగంగానే అదాని కృష్ణపట్నం పోర్టు మూడు ఎలక్ట్రికల్ లోడర్లను తీసుకుని రావడం జరిగింది అన్నారు. ఇందులో ఒక లోడర్ ను ఉపయోగించి పని ప్రారంభించడం జరిగింది అన్నారు. రెండు లోడలు వారం రోజులు కృష్ణపట్నం పోర్టుకు చేరుకుంటాయి అన్నారు. దేశంలో ఏ పోర్టులో ఎక్కడా లేనివిధంగా అదోని కృష్ణపట్నం పోర్టులో ఎలక్ట్రికల్ లోడర్లను ఉపయోగించడం రికార్డు సృష్టించింది అన్నారు. ఒక లోడరు గంటకు 18 లీటర్ల డీజిల్ వినియోగించడం జరుగుతుంది. దీని వలన ఒక గంటకు 115 7.8 కిలోల ఉద్గారాలు వెలువబడుతాయని సంవత్సరానికి 424 టన్నుల ఉద్వారాలను ఎలక్ట్రిక్ వాహనాలతో కాలుష్యం నివారణ జరుగుతుంది అన్నారు. రాబోవు రోజుల్లో ఆదోని కృష్ణపట్నం పోర్టులో ఎక్కువ శాతం ఎలక్ట్రికల్ వాహనాలు ఉపయోగించి కాలుష్యం నివారణకు పర్యావరణ పరిరక్షణకు కృషి చేస్తామని తెలియజేశారు. సుమారు ఒక ఎలక్ట్రికల్ లోడర్ రెండు కోట్ల 80 లక్షల విలువ చేస్తుందని ప్రస్తుతానికి అదాని కృష్ణపట్నం పోర్టులో మూడు లీడర్లు తీసుకోరావడం జరుగుతుంది. అన్నారు ఒక గంట చార్జింగ్ చేయడం వల్ల నాలుగు గంటలు నిరంతరంగా లోడర్ పని చేస్తుంది అన్నారు. ఈ కార్యక్రమంలో సిఓఓ రాజన్ బాబు, లాజిస్టిక్స్ హెడ్ శ్రీధర్, సేఫ్టీ మేనేజర్ వేణు, టెక్నో కమర్షియల్ హెడ్ రమేష్ బాబు, కోల్ యార్డ్ హెడ్ విజయ్ మజ్జి, ఈ హెచ్ హెడ్ వేణుగోపాల్ రెడ్డి, రామకృష్ణ, గంగా సతీష్, వివిధ విభాగాల హెచ్చోడీలు తదితరులు పాల్గొన్నారు.

### కావలి రెడ్ క్రాస్ ను సందర్శించిన
# అంతర్జాతీయ రెడ్ క్రాస్ బృందం

**కావలి యూత్ రెడ్ క్రాస్ దేశానికే మంచి నమూనా .**

**చిన్న పట్టణంలో విస్తృత సేవలందిస్తున్నారని ప్రశంసలు.**



**కావలి మేజర్ న్యూస్:** కావలి పట్టణంలో అంతర్జాతీయ రెడ్ క్రాస్ ప్రధాన కేంద్రం జెనివా అధికారిణి కాతేరిన మేరీ మార్టిన్ తన బృందంతో గురువారం కావలి రెడ్ క్రాస్ ను సందర్శించారు. ఆమెతో పాటు ఇంటర్నేషనల్ కమిటీ ఫర్ రెడ్ క్రాస్ భారతదేశ సహకారాధికారి జాన్ జార్జ్, ఇండియన్ రెడ్ క్రాస్ సొసైటీ సమాచారాధికారిణి రాణి విభూషిత, ఆంధ్రప్రదేశ్ రెడ్ క్రాస్ యూత్ కోఆర్డినేటర్ తెనాలి మధుబాబు బృందంలో ఉన్నారు. వారికి కావలి రెడ్ క్రాస్ ప్రతినిధులు డాక్టర్ బెజవాడ రవికుమార్, దాకారపు రవిప్రకాష్ లు ఘనంగా స్వాగతం పలికారు. రెడ్ క్రాస్ రక్తకేంద్రం, మరణానంతర సేవలు, యోగా తదితర విభాగాలను బృందం పరిశీలించారు. కావలి యూత్ రెడ్ క్రాస్ ప్రతినిధులు బీదా లక్ష్మీనంద, సౌందర్యదీపిక, కీర్తన, సావిత్రి, శ్రావ్య, ధాత్రి, తేజశ్విని లు కావలి రెడ్ క్రాస్ నిర్వహిస్తున్న సేవా ప్రకల్పాలు, కార్యక్రమాలపై దృశ్య మాధ్యమ ప్రదర్శన (పవర్ పాయింట్ ప్రెసెంటేషన్) ఇచ్చారు. అనంతరం కేతరిన్ మేరీ మార్టిన్ మాట్లాడుతూ, జెనివా నుండి తాను పలు దేశాలు పర్యటిస్తూ, ఇండియాకు వచ్చానని, ఆంధ్రప్రదేశ్లో కావలి రెడ్ క్రాస్ కార్యక్రమాలు తన మనస్సును హత్తుకున్నాయని అన్నారు. కావలి యూత్ రెడ్ క్రాస్ ను రాష్ట్రానికి, దేశానికీ ఒక నమూనాగా తీర్చిదిద్దుతున్నారని ఆమె పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో త్వరలో ప్రారంభం కానున్న తలస్సేమియా కేంద్రం ప్రధానదాత రమేష్ రెడ్డి, సంచార జాతుల ప్రజలకు సేవలందిస్తున్న మాజీ మునిసిపల్ కౌన్సిలర్ నందనవనం సీతాలక్ష్మి మరియు కావలి రెడ్ క్రాస్ కోశాధికారి కలికి శ్రీహరిరెడ్డిలను సత్కరించారు. అనంతరం శివరామసుబ్బయ్య కాలనీలో కావలి యూత్ రెడ్ క్రాస్ భాద్యులు పివి సాయితేజ, పి సాయికుమార్, బెజవాడ ప్రసన్నకుమార్‌లు నిర్వహిస్తున్న సేవా కార్యక్రమాలను అంతర్జాతీయ రెడ్ క్రాస్ ప్రతినిధులు పరిశీలించారు. ఈ కార్యక్రమంలో పాఠశాల దూరం కావడం వలన నడిచి వెళ్ళడానికి ఇబ్బంది పడుతున్న 8వ వార్డు మునిసిపల్ హైస్కూల్ కు చెందిన ముగ్గురు బాలికలు, ఒక బాలుడికి పాఠశాల ప్రధానోపాధ్యాయిని సూచన మేరకు నూతన సైకిళ్లను బహుకరించారు. పై కార్యక్రమాలలో రెడ్ క్రాస్ ప్రతినిధులు దామిశెట్టి సుధీర్ నాయుడు,పార్వతిశంకర్, రాజశేఖర్, హరినారపరెడ్డి, ప్రసన్నంజనేయులు, మధుసూదన్ రెడ్డి, బియస్ ప్రసాద్, రెడ్ క్రాస్ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.



## మానవతా దృక్పథంతో ఆర్థిక సాయం చేసిన లుంబిని విద్యాలయం

**వాచ్ మెన్ వైద్య ఖర్చులకు 40 వేల రూపాయలు ఆర్థిక సాయం అందజేత**

**చేజర్ల, మేజర్ న్యూస్ :** మండల కేంద్రంలోని ఓ ప్రైవేట్ పాఠశాల అయిన లుంబిని విద్యాలయంలో గతంలో 15 సంవత్సరాలు వాచ్ మెన్ గా పనిచేసిన బి.నరసింహులు కొద్ది రోజులుగా అనారోగ్యం కారణంగా ఆసుపత్రిలో చేరడం జరిగినది. ఈ విషయం తెలుసుకున్న ఆ పాఠశాల యాజమాన్యం మరియు విద్యార్థులు ప్రతిరోజు ఆప్యాయంగా పలకరించే ఆ వాచ్ మెన్ నరసింహులు ఆరోగ్యం కుదుటపడాలని ఆయన వైద్య ఖర్చులకు లుంబిని విద్యార్థులు ఉపాధ్యాయులు పాఠశాల యాజమాన్యం కలిపి మానవతా దృక్పథంతో 40 వేల రూపాయలు పోగు చేసి ఆర్థిక సాయాన్ని అతని కుటుంబ సభ్యులకు అందజేయడం జరిగింది. మా పాఠశాల విద్యార్థుల మనసు చాలా గొప్పదని ఆపదలో ఉన్న ఆ కుటుంబానికి అండగా ఉండాలని వారు చేసిన ఈ చిరు సాయం కి పాఠశాల యాజమాన్యం కరస్పాండెంట్ బి రమేష్ విద్యార్థులకు అభినందనలు తెలిపారు.

### గ్రామసభను
## విజయవంతం చేయండి

**ఉదయగిరి మేజర్ న్యూస్ :** స్థానిక పంచాయతీ కార్యాలయంలో శుక్రవారం నిర్వహించే ప్రత్యేక గ్రామసభను పట్టణ ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని పంచాయతీ కార్యదర్శి షేక్ కరీముల్లా గురువారం ఓ ప్రకటనలో పేర్కొన్నారు. ఈ గ్రామసభలో ఉపాధి హామీ పనుల ప్రాముఖ్యత గురించి తెలియజేయడంతోపాటు నూతన పను లు గుర్తించి ప్రతిపాదనలు పంపడం జరుగుతుందన్నారు.

## పాఠశాలకు బీరువా వితరణ

**ఉదయగిరి మేజర్ న్యూస్ :** మండలంలోని గండిపాళెం ప్రాథమిక పాఠశాలకు స్వర్గీయ రెడ్డిబత్తిన పరాంధమ య్య జ్ఞాపకార్థం ఆయన కుమారులు, కుమార్తె పెదనారాయణ, జయనారాయణ, నారాయణమ్మలు రూ.8 వేల విలు వైన బీరువా వితరణ చేశారు. అలాగే శుభన్ భోజన్ కార్యక్రమంలో భాగంగా జిల్లా పరిషత్ ఉన్నత, ప్రాదమిక పాఠశాలల విద్యార్థులకు ప్రత్యేక అతిథి భోజనం ఏర్పాటు చేశారు. ఈ కార్యక్రమంలో ఐటీడీపీ నియోజకవర్గ ఇన్చార్జి రెడ్డిబత్తిన ఉమాసాయిరాం. మాజీ ఎంపీటీసీ అడుసుమల్లి వెంకటేశ్వర్లు, మాజీ ఉప సర్పంచ్ రెడ్డిబత్తిన నరసింహారావు, ఉపాధ్యాయులు, గ్రామస్తులు తదితరులు పాల్గొన్నారు.

# ప్రతి కార్యకర్తకు అండగా ఉంటా

## రూరల్ వైసిపి ఇన్చార్జ్ ఆదాల

**మాదరాజుగూడూరులో మాజీ ఎంపీ ఆదాల, మాజీ డీసీసీబీ చైర్మన్ ఆనం పర్యటన**

**కార్యకర్తల గడప తొక్కి భుజం తట్టి భరోసా ఇచ్చిన ఆదాల**

**అధినాయకులు పర్యటనతో ఫుల్ జోష్ లో వైసిపి కార్యకర్తలు, నాయకులు**



**నెల్లూరు (వైద్యం)మేజర్ న్యూస్ :** సాధారణ ఎన్నికల అనంతరం ఓటమితో ఢీలాపడిన నెల్లూరు రూరల్ వైఎస్ఆర్ కాంగ్రెస్ పార్టీ కార్యకర్తలు, నాయకులకు నేనున్నాను భయపడకండి వచ్చేది మన ప్రభుత్వమే రానున్న రోజుల్లో మనకు అంతా మేలు జరుగుతుందని మనోధైర్యాన్ని నింపే క్రమంలో నెల్లూరు రూరల్ నియోజకవర్గం వైఎస్ఆర్ కాంగ్రెస్ పార్టీ ఇన్చార్జ్ ఆదాల ప్రభాకర్ రెడ్డి కార్యకర్తలు, నాయకుల గడపలు తొక్కుతున్నారు. ఇందులో భాగంగా గురువారం సాయంత్రం రూరల్ నియోజకవర్గంలోని మాదరాజు గూడూరు గ్రామంలో డీసీసీబీ మాజీ అధ్యక్షులు ఆనం విజయ్ కుమార్ రెడ్డి, ఎంపీపీ బూడిద విజయ్ కుమార్ యాదవ్, రూరల్ మండల వైసీపీ అధ్యక్షులు పుచ్చలపల్లి రామ్ ప్రసాద్ రెడ్డి తదితరులతో కలిసి పర్యటించారు. ఈ సందర్భంగా మాదరాజు గూడూరు గ్రామంలోని పలువురు వైఎస్ఆర్సిపి కార్యకర్తలు, నాయకుల నివాసాలకు స్వయంగా వెళ్లి వారిని భుజం తట్టి పలకరించి భయపడకండి, అధైర్య పడకండి, మీ అందరికీ అండగా నేనున్నాను అంటూ ఆదాల ప్రభాకర్ రెడ్డి గారు భరోసా ఇచ్చారు. ప్రతి వైఎస్ఆర్ కాంగ్రెస్ పార్టీ కార్యకర్త, నాయకులకు జిల్లా, రాష్ట్ర వైసీపీ నాయకత్వం అన్నివేళలా అందుబాటులో ఉంటూ అండగా ఉంటుందని ఆయన కార్యకర్తల్లో మనోధైర్యాన్ని నింపారు. ఈ కార్యక్రమంలో మాదరాజు గూడూరు వైఎస్ఆర్ కాంగ్రెస్ పార్టీ నాయకులు ఆళ్ల మనోహర్ రెడ్డి, పందిపాటి గోపాల్ రెడ్డి, తాంద్ర సుధాకర్, పుండ్ల చెంచు రెడ్డి, ఉమ్మడిశెట్టి సుధాకర్, నెలవాయి చంద్రారెడ్డి, ఆళ్ల పరంధామ రెడ్డి, పుట్టయ్య, అనిల్, రాంబాబు, రామయ్య, గిరి, మస్తానయ్య, వెంకట రమణయ్య, తాంద్ర సురేష్, తాంద్ర వెంకటేశ్వర్లు కొండాపు రామయ్య తదితరులతోపాటు పార్టీ సీనియర్ నాయకులు పాశం శ్రీనివాస్, స్వర్ణ వెంకయ్య, జిల్లా వైస్సార్సీపీ యూత్ అధ్యక్షులు మంగళ్లపూడి శ్రీకాంత్ రెడ్డి, జడ్పీటీసీ సభ్యులు మల్లు సుధాకర్ రెడ్డి, సిహెచ్ హరిబాబు యాదవ్, సిహెచ్ సూరిబాబు, ఆగాల శ్రీనివాసులురెడ్డి మాదరాజు గూడూరు గ్రామ వైఎస్ఆర్సిపి నాయకులు, కార్యకర్తలు అధిక సంఖ్యలో పాల్గొన్నారు.



## పామాయిల్ ఫ్యాక్టరీ అగ్ని ప్రమాదంపై విచారణ జరపండి.

**డిప్యూటీ కమిషనర్ ఆఫ్ లేబర్ వెంకటేశ్వరరావు కు సిఐటియు , కృష్ణపట్నం ఇండస్ట్రియల్ క్లస్టర్ ప్రతినిధి బృందం వినతి.**

**ముత్తుకూరు, ఆగస్టు 22 (మేజర్ న్యూస్) :** కృష్ణపట్నం పోర్టు బైపాస్ రోడ్డు మార్గంలో ఆయిల్ ఉత్పత్తి కర్మాగారం అయినటువంటి ఎఫ్ ఎఫ్ఎఫ్ ఆయిల్ ఉత్పత్తి కర్మాగారంలో జరిగిన అగ్నిప్రమాదం చర్చనీయాంశంగా మారింది. ఫ్యాక్టరీలో జరిగిన అగ్ని ప్రమాదంపై ఎటువంటి ప్రాణనష్టం లేకపోయినా ప్రమాదానికి గల కారణాలు ఏమిటో ఎవరు కూడా చెప్పడం లేదు. నేపథ్యంలో గురువారం జిల్లా డిప్యూటీ కమిషనర్ ఆఫ్ లేబర్ వెంకటేశ్వరరావు ఫ్యాక్టరీ వద్దకు రాగా సిఐటియు నాయకులు తో పాటు కృష్ణపట్నం ఇండస్ట్రియల్ క్లస్టర్ బృందం ఆయనను కలిసింది. ఈ సందర్భంగా అగ్నిప్రమాదంపై సమగ్రమైన విచారణ చేసి అసలు ఏం జరిగిందో చెప్పాల్సిన అవసరం ఉందని డిమాండ్ చేశారు. దీంతో గంటసేపు వరకు ఈ బృందం ఆయనతో మాట్లాడింది. సమగ్ర విచారణ చేస్తామని డిప్యూటీ కమిషనర్ చెప్పారు. కోట్ల రూపాయల్లో ఫ్యాక్టరీకి నష్టం జరిగినప్పటికీ అదే ప్రాణ నష్టం జరిగి ఉంటే బాధ్యులు ఎవరని ప్రశ్నించారు. ఏది ఏమైనా ప్రభుత్వం మరోసారి ఇలాంటి సంఘటన జరగకుండా చూడాలని కోరారు. ఈ కార్యక్రమంలో ప్రతినిధి బృందం అంకయ్య, శ్రీనివాసులు,రాధయ్య , తదితరులు పాల్గొన్నారు



## జిల్లా కలెక్టర్ ను కలిసిన ఆదాల

**జిల్లా కలెక్టర్ కు పుష్పగుచ్చం అందించి అభినందనలు తెలిపిన ఆదాల**

**ఉప్పుటూరు గ్రామ రైతుల సమస్యలపై కలెక్టర్ తో చర్చ**

**నెల్లూరు (వైద్యం) మేజర్ న్యూస్:** శ్రీ పొట్టి శ్రీరాములు నెల్లూరు జిల్లా నూతన కలెక్టర్ గా నియమితులైన ఓ ఆనంద్ ను మాజీ పార్లమెంట్ సభ్యులు నెల్లూరు రూరల్ వైఎస్ఆర్ కాంగ్రెస్ పార్టీ ఇన్చార్జ్ ఆదాల ప్రభాకర్ రెడ్డి, డీసీసీబీ మాజీ అధ్యక్షులు ఆనం విజయకుమార్ రెడ్డితో కలసి గురువారం కలెక్టర్ కార్యాలయంలో మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ ఆనంద్ తో మాజీ ఎంపీ ఆదాల ప్రభాకర్ రెడ్డి కొన్ని విషయాలుపైన సమగ్రంగా చర్చించారు. అదేవిధంగా వైఎస్ఆర్ కాంగ్రెస్ పార్టీ కార్యకర్తలపై జరుగుతున్న అన్యాయాలను, అక్రమ కేసుల వ్యవహారంపై ఈ సందర్భంగా రూరల్ వైస్సార్ కాంగ్రెస్ పార్టీ ఇన్చార్జి ఆదాల ప్రభాకర్ రెడ్డి కలెక్టర్ దృష్టికి తీసుకువచ్చారు. అదేవిధంగా రూరల్ నియోజకవర్గంలోని గ్రామీణ ప్రాంతాల వైస్సార్సీపీ కార్యకర్తలకు సంబంధించిన పలు సమస్యలపైన మాజీ డిసిసిబి అధ్యక్షులు ఆనం విజయకుమార్ రెడ్డితో కలిసి రూరల్ వైసీపీ ఇన్చార్జ్ ఆదాల ప్రభాకర్ రెడ్డిగారు కలెక్టర్ ఓ.ఆనంద్ తో చర్చించారు. నెల్లూరు రూరల్ మండలంలోని ఉప్పుటూరు గ్రామానికి సంబంధించిన ఆ గ్రామ రైతులతో కలసి రూరల్ వైసిపి ఇన్చార్జ్ ఆదాల ప్రభాకర్ రెడ్డి, డిసిసిబి మాజీ అధ్యక్షులు ఆనం విజయ్ కుమార్ రెడ్డి తదితరులు కలెక్టర్ దృష్టికి తీసుకెళ్లి, సమగ్రంగా చర్చించారు. జిల్లా కలెక్టర్ ను మర్యాదపూర్వంగా కలిసిన వారిలో వైఎస్ఆర్ కాంగ్రెస్ పార్టీ నాయకులు మంగళపూడి శ్రీకాంత్ రెడ్డి మల్లు సుధాకర్ రెడ్డి, సిహెచ్ హరిబాబు యాదవ్, ఎంపీటీసీ సభ్యులు గునపాటి శ్రీనివాసులు రెడ్డి, సిహెచ్ సూరిబాబు, వారాల లక్ష్మీ నారాయణ, ఉడతా మురళి యాదవ్, ఉప్పుటూరు గ్రామ వైసీపీ నాయకులు అంబటి వెంకట నరపరెడ్డి, మధుసూదన్ రెడ్డి, మదనపల్లి శివప్రసాద్, సుంకర శీనయ్య, వంటేరు దయాకర్, అల్లరి ఏడుకొండలు, అంబటి రఘురామిరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

## కావలి గ్రామీణ ప్రాంత సర్కిల్ ఇన్స్పెక్టర్ గా వై. పాపారావు.



**కావలి మేజర్ న్యూస్:** కావలి పట్టణంలో ఈటీవీల జరిగిన సర్కిల్ ఇన్స్పెక్టర్ బదిలీల్లో కావలి గ్రామీణ ప్రాంత సర్కిల్ ఇన్స్పెక్టర్గా వై. పాపారావు ను నియామకం జరిగింది. గతంలో మర్రిపాడు లో ఎస్సైగా పనిచేసే అనంతరం ఆత్మూరులో సర్కిల్ ఇన్స్పెక్టర్గా నాయుడుపేట, చీరాల ప్రాంతాల్లో విధులు నిర్వహించి ఉన్నారు. నూతనంగా బదిలీలలో భాగంగా కావలి గ్రామీణ ప్రాంత సర్కిల్ ఇన్స్పెక్టర్గా నియామకం జరిగింది. సోమవారం బాధ్యతలు స్వీకరించినట్లు విశ్వసనీయ సమాచారం.

## కేఎన్ఆర్ ఉన్నత పాఠశాల హైస్కూలు హెచ్ఎం సస్పెండ్

**నెల్లూరు, మేజర్ న్యూస్ :** నగరంలోని భక్తవత్సల నగర్ లోని ప్రాథమిక పాఠశాలలో ఉన్నత పాఠశాల అదనపు గదుల నిర్మాణం కిటికీ శ్లాబు కూలి 9వ తరగతి విద్యార్థి మృతి చెందిన విషయం తెలిసిందే. ఈ ఘటనకు కలెక్టర్ ఆదేశాలు మేరకు విచారణ చేపట్టిన విద్యా శాఖ అధికారులు 26 పేజీల నివేదిక అందజేశారు. ఇందులో ఉన్నత పాఠశాల ప్రధానోపాధ్యాయులు విజయ ప్రకాష్ నిర్లక్ష్యం కారణం ఉందని తెలియడంతో ఆయనను అధికారులు సస్పెండ్ చేశారు.

## ఏఎస్ పేటలో ఉపాధి కూలీ మృతి



**అనుమసముద్రం పేట మేజర్ న్యూస్ :** మండల కేంద్రమైన ఏఎస్ పేట గ్రామానికి చెందిన ఉపాధి హామీ కూలీ షేక్ ఖాజామసాన్ అనే వ్యక్తి గుండె పోటుతో మృతి చెందిన సంఘటన చోటు చేసుకుంది రోజువారి కార్యక్రమంలో భాగంగా గురువారం ఉదయం ఏఎస్పేట పంచాయతీ పరిధిలో ఉపాధి హామీ కూలి పనికి వెళ్ళాడు. పనిచేస్తూ అలసిపోయి పడిపోయాడు. వెంటనే 108 వాహనం కు ఫోన్ సమాచారం అందించగా వాహనం వచ్చి తరలించే లోపు మృతి చెందాడని ఫీల్డ్ అసిస్టెంట్ మస్తాన్ తెలిపారు. ఉపాధి కూలీ ఖాజా మస్తాన్ గత కొన్ని సంవత్సరాలుగా పనులు చేస్తున్నట్లు తెలిపారు అయితే పని చేసే ప్రదేశంలో ఖజా మస్తాన్ మృతి చెందడం చూసిన కూలీలు కన్నీటి పర్యంతమయ్యారు. విషయం తెలుసుకున్న ఉపాధి హామీ పథకంఈసీ నవీన్, ఏపీఓ లు పని ప్రదేశానికి వెళ్లి ఖాజా మస్తాన్ మృతదేహాన్ని పరిశీలించారుఈవిషయం ఉన్నతాధికారులకు తెలియజేసినట్లు తెలిపారు.

## గాదంశెట్టి వేణు గోపాల్కు పుట్టినరోజు శుభాకాంక్షలు తెలిపిన ప్రముఖులు.



**కావలి మేజర్ న్యూస్:** కావలి పట్టణంలో తెలుగుదేశం పార్టీ నాయకులు 30 వ వార్డు ఇన్చార్జి మరియు వరింద గ్రాండ్ హొటల్ అధినేత ,సెవెన్ లైన్స్, సౌమ్యుడు ఆర్యవైశ్యులకు ఎల్లవేళలా అందుబాటులో ఉంటూ సహాయ సహకారాలు, ఆర్థిక సహాయం కూడా అందించే మంచి మనసున్న వ్యక్తి గాదంశెట్టి వేణుగోపాల్ జన్మదిన సందర్భంగా గురువారం కావలి పట్టణంలోనే ప్రముఖ వైద్యులు తెలుగుదేశం పార్టీ ప్రముఖులు పుట్టినరోజు సందర్భంగా వారికి శాలువాతో సత్కరించి పూల బొకేతో అభినందనలు తెలిపారు. అనంతరం కేక్ కట్ చేసి పుట్టినరోజుకు హాజరైన ప్రముఖులకు అందించారు. హాజరైన ప్రముఖులు జన్మదినం జరుపుకుంటున్న గాదంశెట్టి వేణుగోపాల్ కు తినిపించడం జరిగింది.

## ఎంపీడీఓ కార్యాలయాన్ని పరిశీలించిన పంచాయతీ రాజ్ డైరెక్టర్..

**పొదలకూరు మేజర్ న్యూస్.:** పట్టణంలోని ఎంపీడీవో కార్యాలయాన్ని గురువారం ఏపీ పంచాయతీరాజ్ డైరెక్టర్ యం.కృష్ణ తేజ,ఐ.ఏ.ఎస్ పరిశీలించారు. ఎంపీడీవో కార్యాలయంలోని గదులను, వసతులను, కంప్యూటర్ రూమ్ నుపరిశీలించారు. అనంతరం వర్మీ కంపోస్ట్ ఎరువు తయారీ విధానం, క్రయవిక్రయాల సమాచారాన్ని ఆరా తీశారు. ఎన్.ఆర్ఈజీఎస్ పనుల వివరాలను తెలుసుకున్నారు .ఈ కార్యక్రమంలో ఎంపీడీవో నగేష్ కుమారి, కార్యాలయ సిబ్బంది ఉన్నారు






# శిథిలా వ్యవస్థలో కోడూరు పశువైద్యశాల

**తోటపల్లి గూడూరు మేజర్ న్యూస్ :** మండలంలోని కోడూరు గ్రామంలో ఉన్న పశువైద్యశాల గత 20 సంవత్సరాలకు పైగా పాడుబడి శిథిలావస్థకు చేరడం తో, స్థానిక రైతులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. పశువైద్యశాల చుట్టూ ప్రహరీ లేకపోవడంతో భద్రత పూర్తిగా లోపించిందని వారు పేర్కొన్నారు. వర్షం వచ్చినప్పుడు ఉరవడంతో సంబంధించిన మందులు పూర్తిగా తడిసిపోతున్నాయని తెలిపారు, ఈ వైద్యశాల ద్వారా కోడూరు పంచాయతీ పరిధిలో ఉన్న 13 గ్రామాలనుండి, ఇక్కడికి చికిత్స నిమిత్తం వస్తారు, మరియు వెంకన్నపాలెం నుండి అధిక సంఖ్యలో మూగజీవాలకు చికిత్స కేంద్రంగా ఉంది.

ఈ విషయమై గతంలో పనిచేసిన శాసనసభ్యులకు వివరించినప్పటికీ ప్రయోజనం లేకపోయిందని రైతులు మీడియా దృష్టికి తెచ్చారు. పశుసంవర్ధక శాఖ కూడా ఈ వైద్యశాలపై దృష్టి పెట్టకపోవడం పట్ల రైతులు ఆందోళన వ్యక్తం చేశారు. కూటమి ప్రభుత్వం అధికారంలోకి రావడం సర్వేపల్లి శాసనసభ్యులు సోమిరెడ్డి చంద్రమోహన్ రెడ్డి ఈ పశు వైద్యశాల నూతన భవన నిర్మాణానికి తగిన చర్యలు తీసుకుంటారో లేదో నన్ను అభిప్రాయాన్ని గ్రామస్తులు వ్యక్తపరిచారు.



## ఈ నగరవనం రాష్టానికే, జిల్లాకే గర్వకారణం

**నెల్లూరు రూరల్ (మేజర్ న్యూస్ ) :** నెల్లూరు రూరల్ నియోజకవర్గ పరిధిలో నగరవనం సుందర నగర వనంగా రూపుదిద్దుకుంటుంది ఈ నగరవనం దాదాపు 300 ఎకరాల్లో 4 కోట్ల రూపాయల ఖర్చుతో నగరవనాన్ని ఏర్పాటు చేయడం జరిగింది. ఈ నగర వనం ప్రారంభోత్సవానికి ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు ని, ఉప ముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్ ని, మంత్రి నారా లోకేష్ ని ఆహ్వానిస్తాం. నెల్లూరు జిల్లా ప్రజలందరికి పిలుపునిస్తున్నా. ఈ నగరవనాన్ని సందర్శించండి.నేటి ఉదయం నెల్లూరు నగర వనంలో జరుగుతున్న పనులను పరిశీలించిన నెల్లూరు రూరల్ ఎమ్మెల్యే కోటంరెడ్డి శ్రీధర్ రెడ్డి. వై.ఎస్.ఆర్. కాంగ్రెస్ పార్టీ ప్రభుత్వంలో ఈ నగర వనాన్ని గాలికి వదిలేశారు. ఆ నాటి వై.ఎస్.ఆర్. కాంగ్రెస్ పార్టీ శాసనసభ్యుడిగా ఈ నగర వనం కోసం అనేక ప్రయత్నాలు శక్తివంచన లేకుండా చేశా. కానీ ఫలితం మాత్రం శూన్యం. రూరల్ ఎమ్మెల్యే కోటంరెడ్డి శ్రీధర్ రెడ్డి. ఈ మూడు నెలల్లో పనులు చాలా వేగవంతంగా జరిగాయి. మరో 15 రోజుల్లో పనులు పూర్తిచేసి, ఈ నగర వనాన్ని ప్రజలకు అందిస్తాం నెల్లూరు జిల్లా ప్రజలందరికి పిలుపునిస్తున్నా. ఈనగరవనాన్ని సందర్శించండి. రూరల్ ఎమ్మెల్యే కోటంరెడ్డి శ్రీధర్ రెడ్డి ఈ కార్యక్రమంలో అటవీ శాఖ అధికారులు, రూరల్ సీఐ జి వేణు నియోజకవర్గ స్థాయి నాయకులు కార్యకర్తలు పాల్గొన్నారు.

## మన్నవ రవిచంద్ర మనుమరాలు ఆఫ్ శారీ ఫంక్షన్ కార్యక్రమంలో పాల్గొన్న ఎమ్మెల్యే కావ్య.

**కావలి మేజర్ న్యూస్ :** కావలి సీనియర్ టిడిపి నాయకులు మరియు నెల్లూరు జిల్లా తెలుగుదేశం పార్టీ పార్లమెంట్ ఉపాధ్యక్షులు మన్నవ రవిచంద్ర మనవరాలు హాఫ్ శారిఫంక్షన్ కార్యక్రమానికి గురువారం కావలి శాసనసభ్యులు కావ్య కృష్ణారెడ్డి పాల్గొని చిన్నారిని ఆశీర్వదించారు. ఈ కార్యక్రమంలో తెలుగుదేశం పార్టీ నాయకులు తదితరులు పాల్గొన్నారు.





## లెప్రసీ వ్యాధిగ్రస్తులకు పాదరక్షకులు పంపిణీ

**నెల్లూరు రూరల్ (మేజర్ న్యూస్) :** నెల్లూరు రూరల్ మండలంలోని సౌత్ మోపూర్ ప్రాథమిక కేంద్రం ఆధ్వర్యంలో అమంచర్ల గ్రామపంచాయతీ లో సేవా జ్యోతి కాలనీ నందు ఈరోజు అడిషనల్ డి ఎం హెచ్ ఓ షేక్ ఖాదర్ వల్లి పర్యటించారు గ్రామంలోనే లెప్రసీ వ్యాధిగ్రస్తులకు పాదరక్షకులు పంపిణీ చేశారు మరియు వారి గాయాలకు అవసరమైన బ్యాండేజ్, ఆయింట్ మెంట్ మరియు స్వీట్లు బిస్కెట్లు పండ్లు పంపిణీ చేశారు గ్రామంలోని గర్భవతులను పరిశీలించి తగు జాగ్రత్తలు తీసుకోవాలని చెప్పడం జరిగింది తరువాత సిద్ధవరపు పాడు జరుగుతున్న అడల్ట్ బి. సీ. జి వ్యాక్సిన్ కార్యక్రమం పరిశీలించి ఆ వ్యాక్సిన్ పై అవగాహన కల్పించారు ఈ కార్యక్రమంలో సౌత్ మోపూర్ ప్రాథమిక ఆరోగ్య కేంద్ర డాక్టర్ షేక్ హర్షద్ హుస్సేన్, ఫిజియోథెరపిస్ట్ నరసింహులు, సూపర్వైజర్ పెంచలయ్య, రామారావు, ఎం ఎల్ హెచ్ పి కామాక్షి, హెల్త్ అసిస్టెంట్ పఠాన్ మస్తాన్, ఏఎన్ఎం డి రేఖ, మరియు ఆశా వర్కర్లు గ్రామ ప్రజలు పాల్గొన్నారు.

## ఉపాధి హామీ పథకం పనులపై గ్రామసభలు.

**ముత్తుకూరు, ఆగస్టు 22 (మేజర్ న్యూస్):** జాతీయ గ్రామీణ ఉపాధి పథకంపై



శుక్రవారం గ్రామ సభ జరుగుతాయని అధికారులు గురువారం తెలిపారు. కృష్ణపట్నం, పిడత పోలూరు, ఈపూరు,డమ్మాయ పాలెం గ్రామాల్లో మధ్యాహ్నం రెండు గంటలకు గ్రామ సభలు నిర్వహణ ప్రారంభం కాగా మిగిలిన పంచాయతీల్లో ఉదయం 10 గంటలకు గ్రామ సభలు జరుగుతాయని అధికారులు తెలియజేశారు. కొత్త పనులు నిర్ధారణ చేయడం, అదే విధంగా ఉపాధి హామీ పథకం కూలీలకు ఈ పనులపై అవగాహన కల్పిస్తామని అధికారులు తెలిపారు. గ్రామసభల నిర్వహణకు అధికారులు నియామకం జరిగిందని తెలిపారు.

## బిజెపి పార్టీ అభివృద్ధి కోసం

**తమ జీవితాలలో చివరి క్షణం వరకు శ్రమించి మరణించిన వారి కుటుంబ సభ్యులకు బిజెపి మూలపేట మండల శాఖ సన్మానం**



నెల్లూరు (సిటీ), మేజర్ న్యూస్ : నెల్లూరు నగరం మూలపేటలో జరిగిన బిజెపి మండల సమావే శంలో విశిష్ట అతిథులుగా పార్టీ అభివృద్ధి లక్ష్యంగా పనిచేసిన వారి కుటుంబ సభ్యులను విశిష్టాధితులుగా సమావేశానికి ఆహ్వానించారు జన సంఘ నాటి నుండి బిజెపి వరకు నిరంతరం పనిచే సిన తాంద్ర రమణయ్య కుమార్తె సరోజ కు స్థానికంగా ప్రతినిత్యం బిజెపి తరఫున ప్రజా సమస్యల పరిష్కరిస్తూ వందల ఉద్యమాలలో పాల్గొన్న నెల్లూరు సుధాకర్ భార్య సరస్వతికి ధర్మమే ఊపిరిగా అనేక సంస్కరణలు చేసి కార్యకర్తల గణాన్ని రూపొందించిన రాయ వెంకటేశ్వరరావు సతీమణి రాయ పద్మావతమ్మకి సమావేశంలో బిజెపి రాష్ట్ర కార్యదర్శి రాజేశ్వరమ్మ సన్మానం చేయడం జరిగింది. కుటుంబాలలో ఎన్ని ఆటుపోట్లు వచ్చినప్ప టికీ బిజెపి అభివృద్ధికి పనిచేస్తున్న వారిని మహిళలు ఆటంకం కల్పించ కుండా వారిని ఆదర్శప్రాయాలుగా గుర్తింపు వచ్చే విధంగా సహకరించిన ఈ మహిళలను ఆదర్శంగా తీసుకోవాలని బిజెపి నమామీ గంగ రాష్ట్ర కన్వీనర్ మిడతల రమేష్ కార్యకర్తలకు విజ్ఞప్తి చేశారు.

## చిరంజీవి పుట్టినరోజు సందర్భంగా షటిల్ కిట్ వితరణ..



**పొదలకూరు మేజర్ న్యూస్ :** పట్టణంలోని రమణా రెడ్డి కాలనీకు చెందిన తెదేపా యువ నాయకుడు బ్రహ్మయ్య షటిల్ ఆటగాళ్లకు కిట్ అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ తమ అభిమాన నటుడు పద్మభూషణ్ మెగాస్టార్ చిరంజీవి పుట్టిన రోజు పురస్కరించుకొని షటిల్ ఆటగాళ్లకు షటిల్ బ్యాట్లు, కాక్స్, నెట్ అందజేయడం జరిగిందన్నారు. షటిల్ ప్లేయర్స్ అందరూ బ్రహ్మయ్య కు కృతజ్ఞతలు తెలిపారు. అలాగే మెగాస్టార్ చిరంజీవి కు జన్మదిన శుభాకాంక్షలు తెలిపారు.

## ఏఎస్ పేట ఎంపిడిఓ గా శ్రీనివాసులు



**అనుమసముద్రం పేట మేజర్ న్యూస్ :** ఏఎస్ పేట మండల ఎంపీడీవోగా సి శ్రీనివాసులు గురువారం పూర్తి బాధ్యతలు చేపట్టారు ఏ ఎస్ పేట ఇంచార్జ్ ఎంపీడీవో గా బాధ్యతలు నిర్వహిస్తూ గురువారం నుంచి ఎంపీడీవో గా పూర్తి బాధ్యతలు చేపట్టినట్లు తెలిపారు ఈ మేరకు హౌసింగ్ సిబ్బంది ఉపాధి హామీ సిబ్బంది కార్యాలయంలో సిబ్బంది పూర్తిస్థాయిలో ఎంపీడీవో గా బాధ్యతలు చేపట్టిన శ్రీనివాసులను ఘనంగా సన్మానించారు.

## సీఐని, ఎమ్మార్వోని కలిసిన ఆర్యవైశ్య నాయకులు

**ఆర్యవైశ్య నాయకులు గునుపూడి గిరి**



సంగం మేజర్ న్యూస్ : సంగం మండల నూతన సర్కిల్ ఇన్స్పెక్టర్ గా బాధ్యతలు చేపట్టిన వేమారెడ్డిని మరియు సంఘం మండల తహసిల్దార్ గా బాధ్యతలు చేపట్టిన సోమ్లా నాయక్ ని గురువారం నాడు ఆయా కార్యాలయాల్లో ఆర్యవైశ్య నాయకులు గునుపూడి గిరి, దుగ్గి అనిల్, ప్రభాకర్ శెట్టి, గునుపూడి రాజా ,రామ్ దేసు మర్యాదపూర్వకంగా కలిసి పుష్పగుచ్ఛం అందించి శుభాకాంక్షలు తెలిపారు. ఈ సందర్భంగా ఆర్యవైశ్య నాయకులు గునుపూడి గిరి మాట్లాడుతూ మండలంలో ని సమస్యలను సిఐ కి మరియు ఎమ్మార్వో కి తెలియజేశామని తెలిపారు.

# ఇసుక అక్రమ రవాణా కట్టడికి పూర్తి చర్యలు

- అధిక ధరలు వసూలు చేస్తే చర్యలు తప్పవు
- ఇసుక స్టాక్ పాయింట్ల వద్ద సిసి కెమెరాల నిరంతర పర్యవేక్షణ చేస్తున్నాం
- జిల్లా కలెక్టర్ సుమిత్ కుమార్




**చిత్తూరు బ్యూరో, మేజర్‌న్యూస్:** జిల్లాలో 3 డిపోలలో 1,84,519 మెట్రిక్ టన్నుల ఇసుక ప్రస్తుతం అందుబాటులో కలదని జిల్లా కలెక్టర్ సుమిత్ కుమార్ తెలిపారు. గురువారం సాయంత్రం జిల్లా సచివాలయం సమావేశపు మందిరం నందు జిల్లా కలెక్టర్, జిల్లా ఎస్ పి మణికంఠ చందోలుతో కలసి ఇసుక విదానంకు సంబందించిన విలేఖరుల సమావేశం నిర్వహించారు. ఈ సంధర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ తక్కువ ధరకు ఇసుకను ప్రజలకు అందించేందుకు చర్యలు చేపడుతున్నామని ఇందుకు సంబందించి జిల్లాలో రవాణా శాఖ, మైన్స్, సంబంధిత శాఖ అధికారులతో ఏర్పాటైన కమిటీ స్థిరమైన రవాణా ఛార్జీలతో కలిసి ఇసుకను అందించేందుకు చర్యలు చేపడుతున్నామని తెలిపారు. ఇసుక విదానమునకు సంబంధించి ఇసుక అక్రమ రవాణా కట్టడికి వినియోగదారులు, డి టి సి, ప్రజలు, పోలీసులు, మీడియా నుంచి సమాచారాన్ని సేకరిస్తున్నామని ప్రతి 15 రోజులకు ఒక సారి శాస్త్రీయంగా సర్వే చేస్తున్నామన్నారు. జిల్లాలో ఇప్పటి వరకు 58 వేల మెట్రిక్ టన్నుల ఇసుక అమ్మకం ద్వారా జిల్లాకు రూ.91 లక్షల ఆదాయం చేకూరిందని, ఇసుక అక్రమ రవాణా కట్టడికి పూర్తి చర్యలు చేపడుతున్నామని, జిల్లాలో ఇప్పటివరకు 74 వాహనాలను సీజ్ చేశామని, ప్రతి వాహనం నుండి 4 నుండి 5 మెట్రిక్ టన్నులు ఇసుకను తీసుకోవడం జరిగిందని దాదాపు 3,50,000 వరకు అపరాద రుసుము రూపంలో వసూలు చేయడం జరిగిందని తెలిపారు. ఇసుక స్టాక్ పాయింట్ల వద్ద సి సి కెమెరాల నిరంతర పర్యవేక్షణ చేస్తున్నామని, ఇసుకను తరలించే వాహనదారులు నిర్ణయించిన ధరలకు అందజేయాలని తెలిపారు. గత 45 రోజుల నుండి జి ఎస్ టి, సీనరేజ్, జె సి బి లోడింగ్ చార్జెస్, ఎన్విరాన్మెంట్ టాక్స్ కలిపి ఒక మెట్రిక్ టన్నుకు రూ. 155 చెల్లించవలసి ఉంటుంది ప్రతి రోజూ 2 డిపోల నుండి ఇసుక అమ్మకం జరుగుతున్నది. ఎస్ పితో కలసి ఇసుక డిపోలలో ఇసుక అమ్మకం విధానంను పర్యవేక్షించడం జరుగుతున్నది. 10 కి మీ లోపు రూ.1200, 10-15 కి మీల పరిధిలో రూ.1400, 15-20 కి మీ ల పరిధిలో రూ.1600, 20-25 కి మీ ల పరిధిలో 1900, 25-30 కి మీ ల పరిధిలో రూ.2000 ఇలా రవాణా చార్జీలు నిర్ణయించడం జరిగింది. గరిష్ట ధర దాదాపు రూ.2,700 లకే 5 మెట్రిక్ టన్నుల ఇసుక సమకూర్చడం జరుగుతుందని, అధిక ధరలు వసూలు చేస్తే చర్యలు తప్పవన్నారు. ప్రతి రోజూ రెండు స్టాక్ పాయింట్ ల నుండి 1500 మెట్రిక్ టన్నుల ఇసుక ఉంది. మరో 80 రోజుల వరకు అమ్మకానికి సరిపడా ఇసుక స్టాక్ పాయింట్ ల వద్ద ఉందని, సచివాలయంలో నగదు చెల్లించి రసీదు తీసుకుని ఇసుక రీచ్‌ల వద్ద ఇసుక కొనుగోలు చేయవచ్చునన్నారు. ఈ విలేకర్ల సమావేశం లో అసిస్టెంట్ కలెక్టర్ హిమ వంశీ, మైన్స్ డి డి ప్రసాద్ చిత్తూరు ఆర్ డి ఓ చిన్నయ్య పాల్గొన్నారు.

# ఇంటింటికి నీటి కుళాయి సర్వే వేగవంతం చేయండ

**- నగర కమిషనర్ డా. జె అరుణ**



**చిత్తూరు కార్పొరేషన్, మేజర్‌న్యూస్:** ఇంటింటికి నీటి కుళాయి సర్వేను సత్వరం పూర్తి చేయాలని నగర కమిషనర్ డా. జె. అరుణ అధికారులను, వార్డు కార్యదర్శులను ఆదేశించారు. ఇంటింటికి నీటి కొళాయి సర్వే, పన్నుల వసూలు, వంద రోజుల్లో హౌసింగ్ ప్రోగ్రాం అంశాలపై సంబంధిత అధికారులు, వార్డు అడ్మిన్, అమినిటీ కార్యదర్శులతో సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా కమిషనర్ మాట్లాడుతూ ప్రతి ఇంటికి కొళాయి ద్వారా నీటిని సరఫరా చేయాలని లక్ష్యంతో ప్రభుత్వం నీటి కుళాయి సర్వే చేయిస్తుందని అన్ని వార్డుల్లో సర్వేను వేగంగా పూర్తి చేయాలన్నారు. వార్డుల వారీగా సమీక్షిస్తూ.. ప్రతి ఇంటిని సర్వే చేసి వివరాలను నమోదు చేయాలన్నారు. రికార్డులో ఉన్న కనెక్షన్లు, లేని కనెక్షన్లు, రికార్డుల్లో ఉన్న క్షేత్రస్థాయిలో కనెక్షన్ లేనివి వంటి వివరాలు పక్కాగా నమోదు చేయాలన్నారు. వార్డు స్థాయిలో మిగిలిన సర్వేను సత్వరం పూర్తి చేయాలన్నారు. అనంతరం ఆస్తి, నీటి పన్నుల వసూళ్లపై వార్డువారిగా సమీక్షించారు. హౌసింగ్ ప్రోగ్రాంపై దృష్టి సారించాలని, వంద రోజుల్లో హౌసింగ్ ప్రోగ్రాంలో భాగంగా నిర్దేశించిన లక్ష్యాన్ని పూర్తి చేయడానికి అవసరమైన చర్యలు తీసుకోవాలన్నారు. కార్యక్రమంలో సహాయ కమిషనర్ రామకృష్ణుడు, ఎంహెచ్వో డా.అనిల్ కుమార్ నాయక్, మేనేజర్ గోపాలకృష్ణ వర్మ, హౌసింగ్ ఏఈ శ్రీధర్, సూపర్వైజర్ అధికారులు, వార్డు అడ్మిన్, అమినిటీ కార్యదర్శులు పాల్గొన్నారు.




# లేఔట్లలో గృహ నిర్మాణాలు వేగవంతం చేయండి

**- కమిషనర్ డా. జె అరుణ**



**చిత్తూరు కార్పొరేషన్, మేజర్ న్యూస్ :** నగర పాలక సంస్థ పరిధిలోని లేఔట్లలో వివిధ దశల్లో ఉన్న ఇళ్ల నిర్మాణాలను వేగవంతం చేయాలని కమిషనర్ డా. జె అరుణ అధికారులను ఆదేశించారు. గురువారం ఉదయం కమిషనర్ నగర పరిధిలోని అనుప్పల్లి లేఔట్‌లో జరుగుతున్న ఇంటి నిర్మాణాలను పరిశీలించారు. లబ్ధిదారులతో మాట్లాడారు. ఇళ్ల నిర్మాణాలను వేగంగా పూర్తి చేయాలని ఇందుకు అవసరమైన అన్ని రకాల సహాయ సహకారాలు అందిస్తామన్నారు. “వందరోజుల హౌసింగ్ ప్రోగ్రాం”లో భాగంగా హౌసింగ్ అధికారులు, వార్డు అమినిటీ కార్యదర్శులు, మెప్మా సీవోలు,ఆర్పీలతో సమావేశం నిర్వహించారు. లేఔట్లలో పునాదులు పూర్తై వివిధ దశల్లో ఉన్న నిర్మాణాలను వేగంగా పూర్తి చేయించాలన్నారు. లబ్ధిదారులను కలిసి అవగాహన కల్పించాలని, ఇళ్ల నిర్మాణాలను పూర్తి చేయించేలా చూడాలన్నారు. లబ్ధిదారులకు అవసరమైన సహకారం అందించాలన్నారు. లబ్ధిదారులకు రుణాలు మంజూరు చేయాలని మెప్మా అధికారులను ఆదేశించారు. వార్డువారీగా రుణాలు పొందడానికి అర్హులైన లబ్ధిదారులను గుర్తించి రుణాలు మంజూరు చేయడంతో పాటు, ఇళ్లు నిర్మించుకునేలా అవగాహన కల్పించాలన్నారు. వార్డు వారీగా నిర్మాణాల పురోగతిపై సమీక్ష నిర్వహించారు. కార్యక్రమంలో హౌసింగ్ ఎఈ శ్రీధర్, వార్డు అమినిటీ కార్యదర్శులు పాల్గొన్నారు.

# పురిటి బిడ్డను రోడ్డుపై వదిలేసిన కసాయిలు

**నాయుడుపేట మేజర్ న్యూస్:** ఆడబిడ్డ పుట్టిందని, కర్కశంగా రోడ్డుపై వదిలేసిన హృదయ విదారక సంఘటన నాయుడుపేట పరిధిలో జరిగింది. మండల పరిధిలోని దిమాజిక వద్ద తెల్లవారుజామున రోడ్డుపై వస్తున్న వ్యక్తులకు పసిబిడ్డ ఆక్రందనలు వినిపించడంతో దగ్గరకు వెళ్లి పరిశీలించగా రోడ్డు పక్కన ఆడ పసిబిడ్డ కనిపించింది. చుట్టూ పరిశీలంచగా ఎవరూ లేకపోవడంతో వారు ఆ బిడ్డను ప్రభుత్వాధిపత్రికి చేర్పించి అధికారులకు సమాచారం అందించారు. ఆడబిడ్డ పుట్టిందనో, అక్రమ సంతానమును ఆ పసి గుడ్డును రోడ్డుపై వదిలి వెళ్లిన కసాయి వ్యక్తుల గురించి ప్రజలు చర్చించుకుంటున్నా రు. ప్రభుత్వ వైద్యశాలలో చికిత్స అందించిన అనంతరం ఆ పసిబిడ్డకు ప్రమాదమేమీ లేదని ప్రభుత్వ వైద్యులు తెలిపారు. సమాజ విలువలను దిగజారుస్తూ మానవత్వాన్ని మంట కలుపుతూ ఇలా ప్రవర్తించిన ఆ వ్యక్తులను గుర్తించి కఠినమైన చర్యలు తీసుకోవాలని ప్రజలు కోరుకుంటున్నారు.



# ఎర్రచందనం స్మగ్లరు అరెస్టు

- 13 ఎర్రచందనం దుంగలు, మోటారు సైకిల్ స్వాధీనం



**తిరుపతి మంగళం, మేజర్‌న్యూస్:** సానిపాయ అటవీ ప్రాంతంలో ఒక ఎర్రచందనం స్మగ్లరును అరెస్టు చేయడంతో పాటు వారి నుంచి 13 ఎర్రచందనం దుంగలు, ఒక మోటారు సైకిల్‌లను టాస్క్ ఫోర్సు పోలీసులు స్వాధీనం చేసుకున్నారు. టాస్క్ ఫోర్సు ఇన్చార్జి, తిరుపతి జిల్లా ఎస్పీ ఎల్ సుబ్బరాయుడు ఆదేశాల మేరకు, టాస్క్ ఫోర్సు ఎస్పీ కే. శ్రీనివాస్ నేతృత్వంలో సానిపాయ బేస్ క్యాంపు నుంచి ఆర్ఎస్ఐ మురళీధర్ రెడ్డి బుధవారం కూంబింగ్ చేపట్టారు. వీరు ఎద్దుల కోన రాస్తా మీదుగా కొండూరు గ్రామం చేరుకుని, చిట్వేల్ రేంజి పెంగలూరు మండలం అటవీ ప్రాంతంలోకి వెళ్లారు. గురువారం తెల్ల వారు జామున చక్రంపేట వద్ద ముగ్గురు వ్యక్తులు మోటారు సైకిల్ మీద కూర్చుని మాట్లాడుకుంటూ కనిపించారు. వీరిని సమీపించే చట్టుముట్టే సరికి ఇద్దరు తప్పించుకుని పారిపోయారు. ఒక్కరిని పట్టుకోగలిగారు. ఇతనిని కోడూరు టౌన్ పగడాలపల్లికి చెందిన తుపాకుల హరినాథ్ (37)గా గుర్తించారు. ఇతన్ని విచారించగా దాచి ఉంచిన 13ఎర్రచందనం దుంగలను చూపించాడు. వాటితో పాటు మోటారు సైకిల్ ను స్వాధీనం చేసుకున్న టాస్క్ ఫోర్సు పోలీసులు తిరుపతి టాస్క్ ఫోర్సు పోలీసు స్టేషన్ కు తరలించారు. ఈ కేసును సీఐ సురేష్ కుమార్ నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు. పారిపోయిన వారి కోసం గాలిస్తున్నారు.

# ప్రతిరోజూ నీటి సాంద్రత పరీక్షలు నిర్వహించండి

**- కమిషనర్ ఎన్.మౌర్య**

**తిరుపతి బ్యూరో, మేజర్‌న్యూస్:** నగర ప్రజలకు త్రాగునీరు అందించే అన్ని ట్యాంకుల్లో నీటి సాంద్రత పరీక్షలు ప్రతిరోజు తప్పకుండా నిర్వహించాలని నగరపాలక సంస్థ కమిషనర్ ఎన్.మౌర్య అన్నారు. గురువారం సాయంత్రం మంగళం వద్ద నగరపాలక సంస్థ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న ఫిల్టర్ హౌస్ ను ఇంజినీరింగ్ అధికారులతో. కలసి పరిశీలించారు. నీరు ఎలా ఫిల్టర్ చేస్తున్నారు? ఎన్ని రకాల పరీక్షలు చేస్తున్నారని అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా కమిషనర్ మాట్లాడుతూ ప్రజలకు స్వచ్ఛమైన, సురక్షితమైన నీరు అందించాలని అన్నారు. ఇందు కోసం అన్ని రకాల నీటి సాంద్రత పరీక్షలు నిర్వహించాలని అన్నారు. అన్ని పరీక్షల రిపోర్టులు పక్కగా నమోదు చేయాలని, తనకు ప్రతిరోజు వ్యాట్సాప్ మెసేజ్ చేయాలని అన్నారు. నగర ప్రజలకు నీటి ఎద్దడి రాకుండా, ఎక్కడ నీరు వృధా కాకుండా తగు చర్యలు తీసుకోవాలని అన్నారు. నగరంలో ఎక్కడ కూడా వాటర్ పైపులు, మురుగునీటి పైప్ లైన్లు కలవకుండా నీటి కలుషితం కాకుండా చూడాలని అధికారులను ఆదేశించారు. నీటి సరఫరా పైప్ లైన్ మరమ్మత్తులు వెంటనే సిబ్బంది అప్రమతమై పూర్తి చేయాలని అన్నారు. అలాగే నగరంలోని ప్రధాన కాలువల్లో జరుగుతున్న సిల్ట్ తొలగింపు పనులను ఇంజినీరింగ్ అధికారులతో కలసి పరిశీలించారు. ఈ నెలాఖరులోపు సిల్ట్ తొలగింపు పనులను పూర్తి చేయాలని అధికారులను ఆదేశించారు. కమిషనర్ వెంట సూపరింటెండెంట్ ఇంజినీర్ మోహన్, మునిసిపల్ ఇంజినీర్ వెంకట్రామి రెడ్డి, డి.ఈ.లు సంజయ్ కుమార్, మహేష్, తదితరులు ఉన్నారు.



# ఇంటి నుంచే ప్రతిభా పరీక్ష..!



## ఆలోచనలు, ఆవిష్కరణలకు ప్రోత్సాహం - ఔత్సాహిక విద్యార్థులకు కేంద్రం ఆహ్వానం

**మర్రిపాడు, మేజర్‌న్యూస్ :** రేపటి పౌరుల్లోని ప్రతిభను వెలికి తీసేందుకు.. వారిలో కొత్త ఆలోచనలకు పాదుకొల్పి.. నూతన ఆవిష్కరణలకు దారి చూపేందుకు కేంద్ర ప్రభుత్వం తనవంతు ప్రోత్సాహం అందిస్తోంది. ఇందులో భాగంగా 2024 - 25 విద్యా సంవత్సరానికి సంబంధించి విద్యార్థి విజ్ఞాన్ మంథన్ (వీవీఎం) పేరిట జాతీయ స్థాయిలో ప్రతిభాన్వేషణ్ పరీక్ష నిర్వహిస్తోంది. ఆన్‌లైన్ ద్వారా నిర్వహించే ఈ పరీక్షకు దరఖాస్తులు ఆహ్వానిస్తోంది. అందులో ప్రతిభ చూపితే నగదు ప్రోత్సాహాలతో పాటు సిఎస్ఐఆర్, బార్క్, డిఆర్డివో, జాతీయ ప్రయోగశాలలు, పరిశోధనా సంస్థలను సందర్శించే అవకాశం ఉంటుంది. ఆ పరీక్ష.. రాత విధానం.. దరఖాస్తు ప్రక్రియలు ఎలా ఉంటాయో తెలుసుకుందాం.

### అందరూ అర్హులే..

నేషనల్ కౌన్సిల్ ఆఫ్ ఎడ్యుకేషన్, రీసెర్చ్ ట్రైనింగ్ (ఎన్‌సీఈఆర్టీ), విజ్ఞాన్ ప్రసార్ (కేంద్ర ప్రభుత్వ శాస్త్ర, సాంకేతిక విభాగం), విజ్ఞాన భారతి (స్వదేశీ శాస్త్ర, సాంకేతిక ఉద్యమం) ఆధ్వర్యంలో దేశవ్యాప్తంగా పరీక్ష ఉంటుంది. 6వ తరగతి నుంచి 11వ తరగతి (ఇంటర్ ప్రథమ సంవత్సరం) చదువుతున్న ప్రభుత్వ ప్రైవేటు పాఠశాల విద్యార్థులు అర్హులు. ఆన్లైన్ విధానంలో ఇంటి నుంచే పరీక్షలో పాల్గొనవచ్చు.

### నమోదు..

డబ్ల్యూడబ్ల్యూడబ్ల్యూ.వివిఎం ఓఆర్‌జి.ఇన్ వెబ్‌సైట్‌లో నమోదు చేసుకోవాలి. దరఖాస్తును గూగుల్ ప్లేస్టోర్లో వివిఎం యాప్‌ను డౌన్లోడ్ చేసి నింపాల్సి ఉంటుంది.

### సంవత్సరం అంతా ఉపకారం..

జాతీయ స్థాయిలో ఉత్తమ ప్రతిభ కనబరిచిన వారికి సృజన్ పేరుతో భారత దేశపు పరిశోధనా సంస్థలైన డీఆర్డిఓ, ఇస్రో, సిఎస్ఐఆర్ వంటి వాటిలో ఒకటి నుంచి మూడు వారాలపాటు ప్రత్యేక శిక్షణ (ఇంటర్న్ షిప్) ఇస్తారు. నెలకు 2 వేల రూపాయలు చొప్పున సంవత్సరం పాటు ఉపకార వేతనం అందిస్తారు.

### తెలుగులోనూ రాయొచ్చు..

జూనియర్(6 నుంచి 8వ తరగతి), సీనియర్స్ (9 నుంచి 11 వ తరగతి) విభాగాలుంటాయి. మొత్తం 100 మార్కులకు 100 ప్రశ్నలు ఉంటాయి. గణితం, సామాన్య శాస్త్రం అంశాలు, విజ్ఞాన శాస్త్ర రంగంలో భారతదేశం మేధావుల కృషి, శాంతి స్వరూప్ భట్నాగర్ జీవిత చరిత్ర, భౌతిక, రసాయన, జంతు శాస్త్రాలు, లాజికల్ థింకింగ్, రీజనింగ్ నుంచి బహుళ ఇచ్చిక ప్రశ్నలు ఉంటాయి. మొదటి పాఠశాల స్థాయిలో, తరవాత జిల్లా, రాష్ట్ర, జాతీయస్థాయిలో అంతర్జాలం ద్వారా పరీక్ష రాయాల్సి ఉంటుంది. తెలుగులోనూ పరీక్ష రాసే అవకాశం కల్పించారు.

### చివరి తేదీ సెప్టెంబర్ 15

**దరఖాస్తుకు చివరి తేదీ సెప్టెంబర్ 15, పరీక్షలు అక్టోబర్ 23 లేదా 27 (ఏదో ఒకరోజు మాత్రమే). ఉదయం 10 గంటల నుంచి సాయంత్రం 6 గంటల మధ్య (90 నిమిషాలు మాత్రమే ఉంటుంది. ప్రతి విద్యార్థి పరీక్ష రాసేందుకు ఒకసారి లాగిన్ అవ్వడానికి అవకాశం కల్పిస్తారు.)**

# భద్రత ఏదీ !

(మొదటి పేజీ తరువాయి)

ఇదిలా ఉంటే సైదాపురం మండలంలో మైకా పరిశ్రమలు ఉన్నాయి. వెంకటాచలం మండలంలో కూడా కెమికల్ ఫ్యాక్టరీలు ఉన్నాయి. వింజమూరు మండలంలో ఉన్న పరిశ్రమలో అనేక సార్లు ప్రమాదాలు చోటుచేసుకున్నాయి. ప్రమాదాలు జరిగినప్పుడు అధికారులు హడావుడి చేస్తారు తప్ప.. తరువాత అటువైపు కన్నెత్తి కూడా చూడరు. ముత్తుకూరు మండలంలోని పామాయిల్ ఫ్యాక్టరీలు అధికంగా ఉన్నాయి. అసలు వాటిల్లో భద్రతా ప్రమాణాలు పాటిస్తున్నారా.. ఫైర్, సేఫ్టీ సూచనలు పాటిస్తున్నారా.. అంటే అధికారులకే తెలియాలి. ప్రమాదాలు జరిగిన సమయంలో జిల్లాలో అధికారులు హడావుడి చేస్తారు. తర్వాత ఆ ఊసే ఉండదు. ఫ్యాక్టరీల వల్ల తమకు కాలుష్యం ఎక్కువగా ఉందని, రోగాల బారిన పడుతున్నామని చుట్టుపక్కల గ్రామాల ప్రజలు గగ్గోలు పెడుతున్నా.. పట్టించుకున్న వారులేరు. ముత్తుకూరు మండలంలో ఎంతో మంది శ్వాశకోశ వ్యాధులు, కిడ్నీ వ్యాధులు బారిన పడ్డారు. ఇటీవల యాష్ పాండ్ కట్ట తెగి వందలాది ఎకరాల భూములు నాశనం అయ్యాయి. మరో మూడేళ్ళు ఆ పొల్లాల్లో పంటలు పండే పరిస్థితి లేదు. రైతులు ఆరోగ్యపరంగా, ఆర్థికపరంగా నష్టపోతున్నా.. పట్టించుకునే వారే లేరు. సగానికి పైగా నిబంధనలు ఉల్లంఘిస్తున్నారనే చెప్పవచ్చు. అధికారులు తరచూ తనిఖీలు నిర్వహిస్తే వాస్తవాలు వెలుగులోకి వస్తాయి.

ఇదిలా ఉంటే.. సైదాపురం మండలంలో పరిశ్రమలు అయితే అదొక మాయా సామ్రాజ్యం.. ఏ పరిశ్రమలో ఎంత మంది పని చేస్తున్నారో ఎవరికి తెలియదు. సొరంగాలోకి వెళ్లి పనులు చేయాల్సి ఉంది. అక్కడ ఎంతో మంది ప్రమాదాలకు గురవుతున్నా.. ఎవరికి తెలియదు. ఏ సమాచారం గేట్ దాటి బయటకు రాదు. పరిశ్రమలోకి అధికారులు వెళ్లాలన్నా.. అనుమతి తీసుకుని వెళ్ళాలి. అనుమతి తీసుకున్నా గంటల తరబడి గేట్ బయట వేచి ఉండాల్సిందే.. వాళ్ళకి రూల్స్.. నిబంధనలు.. ఏమీ పట్టవు. అధికారులంటే లెక్క కూడా చేయరు. ప్రమాదాలు జరిగినపుడు ఉలిక్కిపడకుండా ముందు జాగ్రత్త చర్యలు తీసుకుని తనిఖీలు నిర్వహిస్తే నష్టాన్ని నివారించవచ్చు.



# రాష్ట్రస్థాయి వెటర్న్ క్రికెట్ పోటీలు ప్రారంభం








**నెల్లూరు విద్య, మేజర్‌న్యూస్ :** రాష్ట్రస్థాయి ఇన్విటేషన్ వెటరన్ టి-20 క్రికెట్ పోటీలు గురువారం బుజబుజ నెల్లూరు లోని సీఐఏ క్రికెట్ మైదానంలో ప్రారంభమయ్యాయి. సీనియర్ క్రీడాకారుడు తాటిపర్తి సునీల్ కుమార్ స్మారకార్థం ఈ పోటీలు నిర్వహిస్తున్నట్టు ఆంధ్ర క్రికెట్ అసోసియేషన్ సభ్యులు బి.భాను ప్రకాష్ రెడ్డి తెలిపారు. ఈ పోటీలలో హైదరాబాద్ అనంతపురం కడప గుంటూరు కృష్ణా నెల్లూరు జిల్లాలకు చెందిన వెటరన్ క్రీడాకారులు పాల్గొన్నారనీ, గురువారం ఉదయం గుంటూరు అనంతపురం జట్లలో గుంటూరు జట్టు టాస్ గెలిచి నిర్ణీత 20 ఓవర్లలో 260 పరుగులు చేసి విజయం సాధించగా, ఆ జట్టులో ఎస్ఎస్ భరత్ అనే క్రీడాకారుడు అత్యధిక పరుగులు తీసి మ్యాన్ ఆఫ్ ద మ్యాచ్‌గా నిలిచాడు. సాయంత్రం నెల్లూరు కృష్ణ జట్లు తలపడగా నెల్లూరు జట్టు టాస్ గెలిచి నిర్నిత 20 ఓవర్లలో 22 పరుగులు తీసి విజయం సాధించింది సాయంత్రం మ్యాచ్ లో ఎం రాధాకృష్ణ 125 పరుగులు తీసి మ్యాన్ ఆఫ్ ద మ్యాచ్‌గా నిలిచారు. రంజి రాష్ట్రస్థాయికి ప్రాతినిధ్యం వహించే ఉత్తమ క్రీడాకారులు కూడా ఈ పోటీలలో పాల్గొంటున్నారని నిర్వాహకులు తెలిపారు ఈ కార్యక్రమంలో భానుప్రకాష్ రెడ్డితోపాటు హరికృష్ణ, మోహన్, పాల్, చంద్ర, ఎంపైర్లుగా సుదర్శన్, కిరణ్ కుమార్‌లు వ్యవహరించగా, సుమారు 200 మంది క్రీడాకారులు ఈ పోటీలలో పాల్గొన్నట్లు నిర్వాహకులు తెలిపారు. 25వ తేదీ బహుమతి ప్రధానోత్సవం ఉంటుందని, క్రీడాకారులకు ఎటువంటి ఇబ్బందులు లేకుండా అన్ని చర్యలు తీసుకుంటున్నామని భాను ప్రకాష్ రెడ్డి తెలిపారు.



## నడివీధి పోలేరమ్మ చెట్టు ఏర్పాటుకు పూజలు

**జలదంకి, మేజర్‌న్యూస్ :** జలదంకి మండల కేంద్రంలో నడివీధి పోలేరమ్మ స్థలం వద్ద చెట్టును ఏర్పాటు కార్యక్రమం జరిగింది. ఈ సందర్భంగా ప్రత్యేక పూజలు చేశారు. పెదకాపు దేవరపల్లి మధుసూదన్ రెడ్డి అమ్మవారి కలశాన్ని, చెట్టును తప్పెట్లు, మంగళ మేళాలతో గ్రామంలో ఊరేగించుకుంటూ నడివీధి పోలేరమ్మ స్థలం వద్దకు తీసుకొని వచ్చారు. స్థానిక భక్తులు భక్తిశ్రద్ధలతో అమ్మవారిని దర్శించుకుని తీర్థప్రసాదాలు అందుకున్నారు.